ఆదివారం

ప్రజాశక్తి

నవంబరు 9, 2003

బండబారుతున్న బాల్యం

హ్యాపీ బర్త్‌డే

(9-11-2003 నుండి 15-11-2003 వరకు)

ఇ. ప్రణీత
3సం॥, 9.11.2000
లావణ్య- రవికిరణ్
అశోక్‌స్ట్రీట్-నిజామాబాద్

ఉదయ్
2సం॥, 9.11.2001
పద్మావతి- శ్రీనివాస్
రాజాం-శ్రీకాకుళం



భువన శ్రీశైలేశ్వరి
1సం॥, 9.11.2002
శివలలిత- శివసాయిప్రసాద్
పాణ్యం- కర్నూలు

పి. సాయి
4సం॥, 10.11.1999
లలిత- శ్రీహరి
దామేగుంట- నెల్లూరు

వి. వందన
8సం॥, 10.11.1995
రమామణి- సత్యనారాయణ
ఆముదాలవలస-శ్రీకాకుళం

శ్రీశ్వేత
9సం॥, 12. 11.1994
నవోదయ- రమణ
భద్రాచలం- ఖమ్మం

కె.వి.ఎస్.కె. వంశీ
3సం॥, 13.11.2000
మంగ- రాజు
కాకినాడ

బి. వి. సుష్మాశెట్టి
5సం॥, 14.11.1998
భాగ్యలక్ష్మి- శ్రీనివాస్
త్రిపురాంతకం- ప్రకాశం

పాజియాషేక్
1సం॥, నవంబర్- 12
రజియా- గులాం
కొత్తగూడ- నల్లగొండ

కె. తేజస్విని
5సం॥, నవంబర్-1998
ప్రమీల- నరసింహులు
గడివేముల- కర్నూలు

స్నేహ
8సం॥, నవంబర్-1995
కల్పన- రమేష్‌బాబు
భట్టిప్రోలు-గుంటూరు

కె. నవీన్‌కుమార్
1సం॥, నవంబర్- 2002
ప్రమీల- నరసింహులు
గడివేముల- కర్నూలు

ఎ. వైష్ణవి
2సం॥, నవంబర్-2001
రమాదేవి- శ్రీనివాస్
రుద్రారం- మెదక్

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం

కవర్ పేజీ చాలా బాగుంది

అక్టోబర్ 26 ఆదివారం అనుబంధం కవర్ పేజీ చాలా బావుంది. మదర్ థెరిస్సా ఫొటో బాగా ఆకట్టుకుంది. కవర్ స్టోరీ వ్యాసం బాగుంది.

– కె.ఎస్.శ్రీనివాస్, కాకినాడ

కొత్త శీర్షికలు బాగున్నాయి

ఆదివారం అనుబంధంలో కొత్తగా ప్రవేశ పెట్టిన శీర్షికలు బాగున్నాయి. 'ఔరా' ఆసక్తి కరంగానూ, న్యాయ సలహాలు ఉపయోగకరంగానూ ఉన్నాయి. పాఠకుల అభిప్రాయాలకు పూర్తి పేజీ కేటాయించడం సముచితంగా ఉంది. అక్టోబర్ 26వ తేదీ అనుబంధంలో ప్రచురించిన కరుణామయి మదర్‌థెరిస్సా కవర్‌స్టోరీ బాగుంది. చలిచీమలు కథ హృద్యంగా ఉంది. కార్టూన్లు బాగా పేలాయి. ఆదివారం అనుబంధాన్ని మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దాలని కోరుతున్నాము.

-వి. భాస్కరరావు, మంగళగిరి



'చలిచీమలు' బాగుంది

అక్టోబర్ 26 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'చలిచీమలు' అద్భుతంగా వుంది. కొత్త శీర్షికన వచ్చిన ఔరా! చాలా బాగుంది. ఆ శీర్షికలో మరిన్ని అద్భుతాలు ప్రచురిస్తారని ఆశిస్తున్నాం. కవర్ స్టోరీ సందేశాత్మకంగా వుంది. దీనజనోద్ధారకురాలిగా పేరొందిన మదర్ థెరిస్సా గురించి ఎంత చదివినా ఇంకా తక్కువే అవుతుంది. అలాంటి మదర్ మళ్ళీ జన్మించాలని మనసారా కోరుకుంటున్నాను. మూఢనమ్మకంతో ఒక ప్రాణాన్ని బలిగొన్న తీరు చదివి మా కుటుంబమంతా చలించిపోయాము. సైన్స్ బాగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా ఇలాంటి సంఘటనలు జరగడం చాలా దారుణం. ఎక్కువగా సామాన్య, పేద ప్రజల్లో ఇలాంటి మూఢనమ్మకాలు ఛెలరేగుతున్నాయి. ప్రజల్ని చైతన్యవంతం చేయడానికి హైటెక్ కబుర్లు చెబుతున్న చంద్రబాబు ప్రభుత్వం వెంటనే స్పందించి 'మూఢనమ్మకాల' మీద ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టాలి.

– టి. హేమంత్, విజయవాడ.

'మదర్'ను గౌరవించడం సముచితం

అక్టోబర్ 26 ఆదివారం అనుబంధంలో వచ్చిన కవర్ స్టోరీ బాగుంది. కరుణామయి మదర్ థెరిస్సా గురించిన అనేక విషయాలు తెలిశాయి. తన సేవలతో ప్రపంచానికి శుశ్రూష చేసిన మదర్‌కి వాటికన్ పీఠం బీటిఫికేషన్ ఇచ్చి గౌరవించడం సముచితం. నేటి పరిస్థితుల్లో మరో మదర్ థెరిస్సా పుడితేనన్నా ఈ యుద్ధాలు, మారణహోమాలు కొంతవరకు తగ్గుతాయేమో.. అలాగే 'చలిచీమలు' పేరుతో శీరంశెట్టి కాంతారావుగా రాసిన కథ కూడా బాగుంది. సాయిలులా అందరూ సారాకి వ్యతిరేకంగా ఉండాలి.

–ఎస్. నారాయణ, ఎం.కె.వి.పాలెం, గుంటూరు జిల్లా

ఫ్రెండ్స్

మనకు చాలారకాల ఫ్రెండ్స్ ఉంటారని ఒక ఫ్రెండ్ చెప్పాడు.

అందరికీ అన్ని రకాల ఫ్రెండ్స్ ఉండకపోవచ్చు. కొన్ని రకాల వారే ఉండొచ్చు. అసలు ఏ ఫ్రెండూ లేని అర్భక జీవులూ ఉండొచ్చు......

ఫ్రెండ్స్‌లో ఆప్తమిత్రులు, ప్రాణమిత్రులు, డబ్బు మిత్రులు, సుత్తి మిత్రులు ఇలా రకరకాల మిత్రులు మనకు తగులుతూ ఉంటారని ఫ్రెండ్ చెబితే తెలిసింది...

ఇటువంటి ఫ్రెండ్స్ గురించి మనం అనేక సినిమాల్లో చూస్తుంటాము. స్నేహం కోసం ప్రేమను త్యాగం చేసే మిత్రులు, ఆస్తులు త్యాగం చేసే మిత్రులు ఇలా....

అదే విధంగా ప్రేమించిన యువతి కోసం స్నేహితుడినే మోసం చేసేవాడు, ఆస్తి కోసం ప్రాణ సమానంగా నమ్మిన మిత్రుడినే వంచించేవాడు ఇలా ఎన్నో రకాలు...

మనం ఇక్కడ చెప్పుకునే ఫ్రెండ్‌ది విచిత్రమైన క్యారెక్టర్. ఇటువంటి వారిని సుత్తి మిత్రుడు అనొచ్చని ఫ్రెండ్ చెప్పాడు. ఇటువంటి వారు చాలా తెలివైనవారిమని అనుకుంటారు. ప్రపంచంలో అన్ని విషయాలూ సేకరిస్తారు. వాటన్నింటినీ ఫ్రెండ్స్‌కు చెప్పేస్తారు. వారి నోట్లో ఏదీ దాగదు. దాచుకోలేరు. ఇలాంటివారిని ఆలిండియా రేడియా అని పిలుస్తారని కూడా ఫ్రెండ్ చెప్పాడు.

తాను చెప్పేది వింటున్నాడా లేదా ఆవలిస్తున్నాడా అనేది అనవసరం.. ఆ విషయాలన్నీ అతనికి అవసరమా, చెప్పడం మనకు అవసరమా అనే విషయాన్ని కూడా ఆ ఫ్రెండ్ పట్టించుకోడు.

ఇంటి చుట్టుపక్కల వారి గురించి, ఆఫీసులో పక్క సీటులోని వారి గురించి, బాస్ గురించి, వీలైతే ఆయన ఇంటి సంగతులు, ఇద్దరికీ తెలిసిన కామన్ ఫ్రెండ్స్ గురించి, వినే ఫ్రెండ్‌కు తెలియని తన ఫ్రెండ్స్ గురించి గంటల కొద్దీ చెప్పేస్తూనే ఉంటాడు.

బజారులో కనిపించినా, పొరపాటున తనింటికి వచ్చినా లేదా తానే ఫ్రెండ్ ఇంటికి వెళ్ళినా ఇలా చెప్పే సుత్తి మిత్రులు జీవితంలో ప్రతిఒక్కరికీ తగులుతూనే ఉంటారని ఫ్రెండ్ చెప్పాడు. పనుండి బయటకు వెళుతున్నా కూర్చోబెట్టి మరీ చెప్పేస్తుంటాడు.

ఇంట్లో భార్యా పిల్లలతో కలిసి అలా షికారుకు వెళ్ళే సమయానికో లేదా సినిమాకు టిక్కెట్లు తెప్పించుకుని బయల్దేరే సమయానికో ఇటువంటి సుత్తి మిత్రుడు ఇంటికి వస్తే ఇక ఆ ఇంట్లోని వారి పరిస్థితి వర్ణించగలమా?

ఇలా టైము తినేసి మానసికంగా హింసించే మిత్రుల్లో వారికి తెలియని మరో దుర్గుణం కూడా ఉంటుందని ఫ్రెండ్ చెప్పాడు. పాపం తాను చెప్పేది సంబంధిత వ్యక్తులకు ఎంత బాధ కలిగిస్తుందో వారికి తెలియదు, పట్టించుకోరు కూడా. చెప్పకూడని విషయాలు అందరికీ చెప్పేసి పీకల మీదకు తెచ్చుకునే వారూ ఉంటారు.

ఇటువంటి ఫ్రెండ్‌కి విషయాలు తెలిస్తే క్షణంలో ప్రపంచానికి తెలిసిపోతాయని తెలియని అమాయకుడు ఎవరైనా చెప్పకూడని విషయం ఏదైనా చెప్పాడంటే తన మిత్రబృందంలో పరువు పోయినట్లే.... సో ఇటువంటి ఫ్రెండ్స్ విషయంలో జాగ్రత్తగా లేకపోతే అంతేమరి! ●

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం	. . . 4
ఔరా!	. . . 5
కథ	. . . 9
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
జీవనశైలి	. . . 15
ఇంతిసంగతులు	. . . 16
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
కళాసాహితి	. . . 22
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...



బండబారుతున్న బాల్యం
కవర్ స్టోరీ ... 6, 7, 8



ప్రాణదాతలు
రియల్ స్టోరీ
... 14

వెలుగుబాణం - చీకటి కోణం
కచేరి . . . 17

గ్రేట్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్
టూరిస్ట్‌గైడ్ . . . 21

SPEAK ENGLISH FLUENTLY

తెలుగు తెలిస్తే చాలు...

మీరు ఇంట్లోనే ఉండి సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి!

5 లక్షలమందికి పైగా నేర్చుకున్న ఇంగ్లీష్ కోర్సు మరి మీరూ...

స్టూడెంట్ అభిప్రాయం

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ ఫ్లూయెంట్‌గా మాట్లాడలేకపోయేవాడిని. నాకు ఒక మిత్రుని సలహా లభించి కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ తెప్పించి చదివాను. కేవలం ఒక్క నెలరోజుల్లోనే చక్కగా ఇంగ్లీష్ మాట్లాడగలుగుతున్నాను. –జె.వి.రావు, విజయవాడ.

ఈ కోర్స్‌తో 25 గిఫ్ట్ పుస్తకాలు ఉచితం!

1. హిందీ స్పీకింగ్ కోర్సు 2. తమిళ్ స్పీకింగ్ కోర్సు 3. కన్నడ స్పీకింగ్ కోర్సు 4. మలయాళం స్పీకింగ్ కోర్సు 5. బెంగాలీ స్పీకింగ్ కోర్సు 6. మరాఠీ స్పీకింగ్ కోర్సు 7. పంజాబీ స్పీకింగ్ కోర్సు 8. గుజరాతీ స్పీకింగ్ కోర్సు 9. అరబిక్ స్పీకింగ్ కోర్సు 10. ఉర్దూ స్పీకింగ్ కోర్సు 11. ఒరియా స్పీకింగ్ కోర్సు 12. సాన్‌స్క్రిట్ స్పీకింగ్ కోర్సు. (12 ఇన్ 1 పాకెట్ సైజులో) 1. ఇంగ్లీష్ డిక్షనరీ 2. వర్డ్ పవర్ 3. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ 4. వెర్బ్స్ డిక్షనరీ 5. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ. (5 ఇన్ 1 పాకెట్ సైజులో) 1. ఈజీ మనీ ఎర్నింగ్ కోర్సు. 2. సీక్రెట్ మ్యాజిక్ కోర్సు. 3. జెంట్స్ స్మార్ట్‌నెస్ కోర్సు. 4. బ్యూటీ ట్రీట్‌మెంట్ కోర్సు. 5. సక్సెస్‌ఫుల్ ఎగ్జామినేషన్ కోర్సు. 6. యోగా కోర్సు. 7. పా 'మిస్టరీ' కోర్సు. 8. కిచెన్ ట్రీట్‌మెంట్ కోర్సు. (8 ఇన్ 1 పాకెట్ సైజులో) *ఈ ఇంగ్లీష్ కోర్స్ తర్వాత మరో 4 నెలల కోర్సు కూడా ఉంది. ఈ కోర్సులు నియమిత నామమాత్రపు ఫీజుతో పంపుతాము. మీరు కావాలనుకుంటే పొందవచ్చు. తప్పకుండా తీసుకోవాలన్న నిబంధన లేదు.

ఈ కూపన్ పంపండి.

2672

K.V.R. B.Com.,B.L., (Director)

KVR INSTITUTE

Award Winner

No.76, Habibullah Road, T.Nagar, Chennai - 17. Ph: 044 - 56107404

నాకు కె.వి.ఆర్.ఇంగ్లీష్‌కోర్స్ మరియు 25 గిఫ్ట్‌పుస్తకాలు వి.పి.పి. లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.150/-లు పైకం చెల్లించి తీసుకుంటాను.

(మీ చిరునామా స్పష్టంగా అర్థమయ్యేలా ఇంగ్లీష్‌లో వ్రాయండి. లేనిచో కోర్స్‌ను పంపుటకు వీలుపడదు)

Name: ....

Address: ....

....

.... Pin Code: | | | | | |

DIRECT COACHING CENTRES: ● CHENNAI: 56107404. ● NELLORE: 2342347.

కార్టూన్ కదంబం


బిందు సేద్యం
ఇక ప్రాజెక్టులతో.. పనేఉండదు
వ్యవసాయం
గంగాధర్..


జ
ఎన్నికల వరాలు


రెండూ ప్రచారాస్త్రాలే..
ఒకటి.. స్టేట్.. మరొకటి నేషనల్


త్వరపడండి ఎన్నికల ఆఫర్
పదిలక్షలు గ్యాస్ కనెక్షన్లు
త్వరలో అపెరల్ పార్కు కూడా..!!

కాలనాగు కంటే భయంకరుడు!



మనలో చాలామంది ఉదయం లేవగానే కాఫీ లేదా టీ తాగి దినచర్యలను ప్రారంభిస్తారు. కానీ బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలోని ఓ కుగ్రామంలో నివసించే మహ్మద్ కరీం అనే 20 ఏళ్ళ యువకుడి దిన చర్య మామూలుగా ప్రారంభం కాదు. ఉదయం లేవగానే ఒక డోస్ పాము విషం సేవించందే ఆయనకు తోచదు. ఏ రోజైనా విషం తీసుకోకపోతే నీరసంగా ఉంటుందని చెప్పే కరీం ఎప్పుడూ మెడలో విషసర్పాన్ని ధరించే కనిపిస్తాడు. అయితే ఒకరోజు విషం తీసుకున్న తర్వాత కరీం స్పృహతప్పి పడిపోయాడు. కొద్ది గంటల తర్వాత తెలివి వచ్చి లేచేసరికి తనకు విషం ఇచ్చిన పాము చచ్చి పడిఉంది. ఈ ఘటన తర్వాత వైద్యులు కరీంను పరీక్షించారు. అతని వంట్లో ఉన్న విషం కాలనాగు కోరల్లోని విషం కంటే భయంకరమైనదట! ఆ విషాన్ని తట్టుకోలేకే పాము మరణించిందని వైద్యులు నిర్ధారించారట!

ఇదోరకం మూఢనమ్మకం!

భారతదేశంలో మూఢనమ్మకాలు రకరకాలు. వర్షాల కోసం నగ్నంగా పూజలు చేస్తారు, కప్పల పెళ్ళిళ్ళు చేస్తారు, యాగాలు కూడా చేస్తారు. ఒరిస్సా రాష్ట్రంలోని నౌపదా అనే గ్రామంలో ఓ వింత ఆచారం అమల్లో ఉంది. పెద్దయిన తర్వాత మంచి భర్తలు వస్తారనే ఆశతో చిన్న పిల్లలకు అదీ బాలికల మధ్య పెళ్ళిళ్ళు చేస్తారక్కడ. ఎనిమిది నుండి పది సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు ఒకరికి వరుడుగా ఒకరికి వధువుగా వేషం వేసి వివాహాలు నిర్వహించడం అక్కడి ఆచారం. పెద్దయిన తర్వాత వారికి ఎటువంటి భర్తలు దొరుకుతున్నారో కాని గ్రామంలో అనుసరించే ఈ తంతులో మాత్రం మార్పు వచ్చింది. గతంలో కుటుంబ పెద్దలు తమ ఆడపిల్లల భవిష్యత్తు కోసం ఆడ, మగ బొమ్మలకు పెళ్ళిళ్ళు చేసేవారట. కొన్ని సంవత్సరాలుగా అది మారి నిజంగా పిల్లలకే ఉత్తిత్తి పెళ్ళిళ్ళు నిర్వహిస్తున్నారు.

ముంబయి కార్పోరేషన్‌కి ఫోన్ చేయండి!

గోరా!

పిల్లలు లేని దంపతులకు ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఉచితంగా సలహాలు ఇప్పిస్తోంది. మన దేశంలో 2 కోట్ల మంది దంపతులు పిల్లలు లేక బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకటించింది. అందునా దేశంలోని మహానగరాల్లో ముంబయి ఈ సమస్యను అధికంగా ఎదుర్కొంటోంది. ఈ మహానగరంలోని దంపతుల్లో సంతానం లేని వారు డాక్టర్ల వద్దకు వెళ్ళడానికి సిగ్గుపడుతుండటంతో వారి కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఒక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. నగరపౌరుల సౌకర్యార్థం ఈ ఏర్పాటు చేశామని, నగరంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలనేదే తమ ధ్యేయమని అధికారులు వివరణ ఇచ్చుకుంటున్నారు. ఎవరైనా పిల్లలు లేని దంపతులు కార్పొరేషన్ ఇచ్చిన ప్రత్యేక టెలిఫోన్ నంబర్‌కు ఉచితంగా డయిల్ చేసి ఉచితంగా సలహాలు పొందవచ్చట! దేశంలో ప్రజల కోసం ఈ విధమైన ఏర్పాటు చేసిన మొదటి మున్సిపల్ కార్పొరేషన్‌గా ముంబయి గణతికెక్కింది.

ఖైదీ ఉత్పత్తులు



శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో రకరకాల వస్తువులు తయారు చేయించి వాటిని విక్రయించడం తీహార్ జైల్లో ఎప్పటినుంచో అమలవుతోంది. ఖైదీలు ఉత్పత్తిచేసే వాటిని అమెరికా తదితర దేశాలకు ఎగుమతి చేస్తూ జైలు బాగానే ఆర్జిస్తోంది. ఆదాయంలో ఖైదీలకు కూడా కొంత వాటా వస్తున్నందున వారికి కూడా ఉత్సాహంగా ఉండి ఢిల్లీలోని ఒక ప్రాంతంలో కొంతకాలం క్రితం ఒక షోరూమ్ తెరిచారు. అక్కడ వ్యాపారం పెద్దగా లేకపోవడంతో దాన్ని మూసివేసి జైలు పక్కనే షోరూమ్ ఏర్పాటు చేశారు. అక్కడ కూడా ఇంకా వ్యాపారం పుంజుకోలేదు. ఉత్పత్తులపై ఖైదీలు తయారు చేసినవి' అని రాసి ఉండటంతో కొనుగోలుదారులు మూతి విరుస్తున్నారట. మనవారిలో ఇంకా మార్పు రావాల్సిఉందని, వస్తుందని ఆశిస్తున్నామని జైలు అధికారులు అంటున్నారు.

❋ ఇ.వి. బాలాజీ

భాగ్యవంతుల
భవంతుల్లో
వాడిపోతున్న బాల్యం

బండబారుతున్న బాల్యం

"హైటెక్ రాజధానిలో సీనియర్ ఐఏఎస్ అధికారి ఇంట బాలకార్మికుడు.

హైదరాబాద్‌లోనే పోలీసుల వేధింపులు భరించలేక బాలకార్మికురాలి ఆత్మహత్య.

కర్నూల్‌లో కాళ్ళకు సంకెళ్ళతో బాలకార్మికులతో పని చేయిస్తున్న యజమాని.

హైదరాబాద్‌లోని పిల్లల జైలులో బాధలు పడలేక 12 మంది బాలల పరారీ" ఇవన్నీ గత నెలలో అన్ని దినపత్రికల్లో ప్రముఖంగా కనిపించిన వార్తలు.

2004 నాటికి రాష్ట్రంలో బాలకార్మికవ్యవస్థ నిర్మూలించాలని నిర్ణయిస్తూ **2001** మార్చిలో అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం.

నవంబర్ 14 బాలల దినోత్సవం

పిల్లలను బడికి పంపని తలిదండ్రులకు, బాలలతో పనిచేయించుకునే వారికి జరిమానా, జైలు శిక్ష విధిస్తామని మూడేళ్ళుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు ప్రకటనలు చేశారు. అంతేగాకుండా **2005** నాటికి రాష్ట్రంలో పిల్లలెవరూ బడికెళ్ళకుండా ఉండరాదని హెచ్చరించారు.

అసెంబ్లీలో చేసిన తీర్మానం ప్రకారం మరో ఐదు నెలల్లో రాష్ట్రంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కావాలి. ఇప్పటికీ లక్షలాది మంది బాలలు పనులు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని భాగ్యవంతులు ఉండే బంజారాహిల్స్, జూబిలీహిల్స్ ప్రాంతంలో బాలకార్మికులు ఉండని ఇల్లు లేదంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. నెల రోజుల క్రితమే ప్రభుత్వంలో అత్యంత ముఖ్యమైన బాధ్యతలో ఉన్న ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి ఇంట బాలకార్మికుడిపై నేరం మోపి కేసుపెట్టినట్లు వెలువడిన వార్త సంచలనం సృష్టించింది. దీంతో కేంద్ర మానవహక్కుల సంఘం వెంటనే స్పందించి రాష్ట్రంలో బాలకార్మికుల పరిస్థితి గురించి నివేదిక పంపాల్సిందిగా రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే తన లక్ష్యమని చెప్పుకునే ప్రభుత్వం ఇందుకు అవసరమైన చట్టం చేయడానికి ముసాయిదా బిల్లును తయారుచేయించింది. న్యాయవిశ్వవిద్యాలయం వారు దీన్ని తయారు చేసి జులై 3న ముఖ్యమంత్రికి అందజేశారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో బిల్లు సభలో ప్రవేశపెట్టి చట్టం చేస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు మరిచిపోయారు. దాన్ని సభలో ప్రవేశపెట్టనేలేదు. మరో ఐదు నెలల్లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన గడువు తీరిపోతున్నా దీని పట్ల ప్రభుత్వం ఎంత శ్రద్ధ తీసుకుంటున్నదో అర్థమవుతోంది. చట్టాలు చేసే అధికారుల ఇళ్ళలోనే బాలకార్మికుల చేత పనిచేయించుకుంటే ఇక వారు చేసే చట్టాలకు విలువ ఏముంటుంది? బాలలను దోపిడీ చేసేవారిని ఈ ప్రభుత్వం ఎలా అదుపుచేస్తుంది? బాలకార్మికవ్యవస్థను ఎప్పటికి నిర్మూలిస్తారు?

పలకా, బలపం పట్టుకుని బడికి వెళ్ళాల్సిన బాల్యం తట్టా, బుట్టా చేతబట్టి బండబారిపోతోంది.

అమ్మ చేతి గోరుముద్దలు తినాల్సిన పసివయస్సు పని ప్రదేశాల్లోని చెట్ల కింద, రేకుల షెడ్ల పీడలో వాడిపోతోంది.

ప్రపంచ జనాభాలో రెండవ స్థానం ఆక్రమిస్తున్న భారత్‌కు అన్ని అవకరాల్లోనూ మొదటి స్థానమే లభిస్తోంది. ప్రపంచం మొత్తం మీద బడికి వెళ్ళని బాలల్లో మూడోవంతు మన దేశంలోనే ఉన్నారు. నిరక్షరాస్యులు, పౌష్టికాహార లోపం, దోపిడీ, అత్యాచారాలకు గురవుతున్న బాలలూ మన దేశంలోనే ఎక్కువ.

కార్ఖానాలు, హోటళ్ళు, సైకిల్‌షాపులు, మెకానిక్ షాపులు, దుకాణాలు, ధనవంతుల ఇళ్ళు, పొలాలు, భూస్వాముల ఇళ్ళు ఇలా బాలకార్మికులు పనిచేయని చోటు లేదు. రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్ వద్ద అడుక్కోవడాలు, చిల్లర పనులు, వీధుల్లో అడుక్కోవడం, నాలుగురోడ్ల కూడళ్ళలో అడుక్కునే బాలికలు కనిపించని పట్టణం లేదు.

పేదరికం, అజ్ఞానం, క్షామం, వలసలు ఇవన్నీ బాలల జీవితాలను బండబారుస్తున్నాయి. కరువు పీడించే కాలంలో ఒంట్లో శక్తి ఉన్నవారంతా తిండికోసం, పనులకోసం పట్టణాలకు వలసపోతే పల్లెల్లో మిగిలిపోయే బాలలు తిండిలేక, చదువు లేక అల్లాడిపోతున్నారు. బాల్యాన్ని మరిచి ఏవో పనులు చేస్తూ, అడుక్కుంటూ పొట్టనింపుకుంటున్నారు. పల్లెలనుండి కుటుంబాలతో సహా వలసవచ్చి నగరాల్లోని మురికివాడల్లో స్థిరపడే వారి పిల్లల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు.

చదువుకోలేక, పొట్టనింపుకోవడానికి పనులు చేయడం ఒక భాగమైతే, చిల్లర నేరాలు చేయడం, గూండాల చేతుల్లో పావులుగా మారడం తదనంతరం సమాజానికి శత్రువులుగా తయారవడం వంటి అనేక దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. ఆడపిల్లల పరిస్థితి అయితే మరీ దారుణం. ఇంటా, బయటా అనేక అవమానాలు, ఛీత్కారాలు ఎదుర్కొంటున్నారు. అత్యాచారాలకు గురవుతున్నారు.

రాష్ట్రంలో 17 లక్షల మంది బాలకార్మికులు ఉన్నారని 1991 లెక్కల ప్రకారం యునిసెఫ్ నిర్ధారణ చేసింది. భారతదేశంలో కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా బాలకార్మికులు ఉన్నారని యునిసెఫ్ సర్వే తేల్చింది. కాని ఈ సంఖ్య దాదాపు 40 లక్షలు ఉంటుందని అనేక స్వచ్ఛంద సంఘాలు ప్రకటించాయి. ప్రభుత్వం మాత్రం 10 లక్షల కంటే ఎక్కువ లేరని బుకాయించింది. దశాబ్దం తర్వాత కూడా రాష్ట్రప్రభుత్వం బాలకార్మికుల సంఖ్య తగ్గిందని అంటోందే గాని ఎంతమంది ఉంటారో తేల్చి చెప్పలేకపోతోంది. స్వతంత్ర సంఘాలు చెబుతున్న అంకెలను కచ్చితంగా ఖండించలేకపోతోంది. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ తొమ్మిది సంవత్సరాల్లో రాష్ట్రంలో పేదరికం దాంతోపాటే బాలకార్మికుల సంఖ్య పెరిగిందే గాని ఏమాత్రం తగ్గలేదని పరిశీలకులు నిర్ద్వంద్వంగా పేర్కొంటున్నారు.

జూన్ 12న బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం అని, నవంబర్ 14న బాలల దినోత్సవం అని ఏటా రెండు సార్లు కోట్ల రూపాయలు ఖర్చుచేసి దేశవ్యాప్తంగా తద్దినాల మాదిరి సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. మళ్ళీ బడికి, చదువుల పండగ పేర్లతో రకరకాల కార్యక్రమాలు చేస్తున్నారు. బడుల్లో హాజరు తగ్గకుండా చూడటానికి మధ్యాహ్న భోజన పథకం అమలుచేస్తున్నారు. ఈ కార్యక్రమాలన్నీ అధికారుల జేబులు నింపడానికి, పిల్లల నోళ్ళు కొట్టి తెగబలవడానికే ఉపయోగపడుతున్నాయి.

రాష్ట్రంలోని బాలకార్మికుల గురించి

అత్యాచారాలు ఇక్కడే అధికం

భారతదేశంలో బాధిత బాలల్లో బాలికలే అధికం. ఇంట్లో లేదా వారుండే ప్రాంతంలో లేదా సమాజంలో ఏ ఉత్పాతం సంభవించినా ఏ దుస్సంఘటన జరిగినా ముందుగా బలయ్యేది బాలికలే. ప్రధానంగా సమాజంలోని నైతిక పతనం బాలికల ఉసురు తీస్తోంది. బాలికలు అత్యధికంగా లైంగికంగా వేధింపులకు గురవుతోంది భారత్‌లోనేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల వెల్లడించింది. 16 ఏళ్ళ లోపు బాలికల్లో 155 నిముషాలకు ఒకరు చొప్పున అత్యాచారానికి గురవుతున్నారు. పదేళ్ళలోపు బాలికల్లో ప్రతి 13 గంటలకు ఒకరు చొప్పున అత్యాచారానికి గురవుతున్నారు. ప్రతి పదిమందిలో ఒక బాలిక ఏదో సమయంలో అత్యాచారానికి గురవుతున్నారు. భారతదేశంలో బాలలపై అత్యాచారాలు జరిగితే శిక్షించడానికి సరైన, సమగ్రమైన చట్టాలు లేనందున వీటికి అంతూపొంతూ లేకుండా పోతోంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కూడా లైంగిక వేధింపులకు పాల్పడుతుండటంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాలికలు మౌనంగానే రోదిస్తున్నారు. బాలల హక్కులకు అంతర్జాతీయ సమాజం ఆమోదం లభించిన తర్వాత కూడా వారికి ఎటువంటి రక్షణా ఉండటంలేదు .

బంగారు బాల్యం



పొట్టనిండాలంటే బతుకు బండి లాగాల్సిందే

శిశు మరణాల్లో ఆంధ్రా ఫస్ట్

శిశు మరణాలు, బాలింతల మరణాలు మనదేశంలో ఎక్కువేనని 'ఐక్యరాజ్యసమితి అభివృద్ధి నివేదిక 2003' పేర్కొంది. భారత్‌లో శిశు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్న 11 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందు పీఠిన ఉండటం విశేషం. ప్రపంచబ్యాంక్ వద్ద అప్పుతెచ్చి ఆస్పత్రులు కట్టించి, కమిటీలు వేసి నానా హడావిడీ చేసినా వైద్య, ఆరోగ్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ స్థితి ఎంత అధమంగా ఉందో ఐరాస వివరించింది. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన విషజ్వరాల మరణాలు చూస్తే ఈ నివేదిక ఎంత నిక్కచ్చిగా తయారైందో తెలుస్తోంది. విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ వెనుకబడినట్లు నివేదికలో స్పష్టంగా ఉంది.

అంతర్జాతీయంగా పేరుమోగుతుండటంతో ఎలాగైనా సరే వారి సంఖ్యను తగ్గించి చూపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కంకణం కట్టుకున్నారు. మళ్ళీ బడికి, చదువుల పండుగ, అక్షర సంక్రాంతి వంటి పేర్లతో పిల్లలను బడుల్లోకి చేర్పించే కార్యక్రమాలు చేపట్టారు. బడికి వెళ్ళని లక్షలాది మంది బాలలను బడుల్లో చేర్పించామని ప్రకటనలిస్తూ మంత్రులు, అధికారులు చంకలు గుద్దుకున్నారు. బడికి వెళ్ళని బాలలు ఎవరూ రాష్ట్రంలో లేరని ప్రకటించుకున్నారు. ఒకసారి బడిలో చేరిన తర్వాత వారు మానకుండా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

ఇన్ని చర్యల తర్వాత కూడా గ్రామాల్లో పశువులు కాసేది, భూస్వాముల ఇళ్ళల్లో పనులు చేసేది, రోడ్లపై దుమ్ములో, ధూళిలో ఆడేది ఈ బాలలేనని తేలింది. ప్రభుత్వం చేపట్టిన చర్యలన్నీ వట్టి బూటకాలని ఇటీవల సంభవిస్తున్న అనేక సంఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. పట్టణాల్లోని దృశ్యాల్లోనూ మార్పు రాలేదు. మొత్తం మీద బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి, పిల్లలందరినీ బడికి పంపించడానికి ప్రభుత్వం పడే తపన ఒట్టి బూటకమని, చేతలన్నీ నాటకమని నిర్ధారణ అవుతోంది.

ప్రమాదకర పనుల్లో బాలలను ఉపయోగించడాన్ని నిషేధిస్తూ 1986 లోనే కేంద్రప్రభుత్వం చట్టం చేసింది. కాని ఇప్పటికీ అనేక ప్రమాదకర పనుల్లో ఎటువంటి రక్షణలు లేకుండానే బాలల చేత వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ప్రభుత్వాలు మాత్రం చట్టాలు చేసి మిన్నకుంటున్నాయి. అయితే ఈ విషయంలో జోక్యం చేసుకున్న సుప్రీంకోర్టు బాలల చేత పనిచేయించే యజమానులకు రు.20 వేల జరిమానా విధించి, మరో 5 వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం కలిపి బాలుని పేర బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. అయితే మన రాష్ట్రంలో ఈ ఆదేశాలు కూడా అమలు కావడంలేదు.

ఈ హైటెక్ రాష్ట్రంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించడం ప్రభుత్వాలకు చేతకాకపోవడంతో అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐఎల్ఓ) కూడా పూనుకోవలసి వచ్చింది. దేశంలో తొలిసారిగా ఐఎల్ఓ ఆంధ్రప్రదేశ్‌ను మోడల్ రాష్ట్రంగా ఎంపిక చేసుకుని బాలకార్మికవ్యవస్థ నిర్మూలనకు రంగంలోకి దిగింది. ముందుగా కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం పనిచేసే కార్మికసంఘాల సహకారాన్ని ఇందుకు తీసుకుంది. ఆరు ప్రధాన కార్మికసంఘాలు ఇందులో భాగస్వాములుగా చేరి ఒక్కో సంఘం ఒక్కో జిల్లాలో బాధ్యత తీసుకున్నాయి. వాటి పంథాలో ఆయా జిల్లాల్లో బాలకార్మికవ్యవస్థ నిర్మూలనకు అవి ప్రచారం చేస్తున్నాయి. కార్మికసంఘాలు ఆరు జిల్లాల్లో చేస్తున్న ప్రచారానికి తోడు ఇందులో డాక్టర్లు, లాయర్లు, ఇతర స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వాములను చేసి ఐఎల్ఓ రాష్ట్రంలో బాలకార్మికవ్యవస్థ నిర్మూలనకు విస్తృత ప్రచారం చేస్తోంది. అయితే బృహత్తరమైన ఈ కార్యక్రమం అమలులో ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధి ప్రదర్శించక పోవడంతో ఆశించిన విధంగా ఫలితాలు రావడంలేదు.

ఐఎల్ఓ చొరవ, కార్మిక సంఘాల కృషివల్ల రాష్ట్రంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, నిర్బంధ విద్యకు సంబంధించి ఒక ముసాయిదా బిల్లును తయారుచేయడానికి ఒక కమిటీని నియమించింది. న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రణబీర్‌సింగ్ నేతృత్వంలోని కమిటీ ముసాయిదా బిల్లును రూపొందించి గత జులైలో ముఖ్యమంత్రికి సమర్పించింది. దీనిపై ఇచ్చిన హామీకి విరుద్ధంగా గత సమావేశాల్లో బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టలేదు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం బాలలతో పనిచేయించే వారిపై చర్యలు కూడా తీసుకోవడం లేదు. నిరక్షరాస్యతకు, బాలకార్మికవ్యవస్థ కొనసాగడానికి గల ప్రధాన అడ్డంకులను తొలగించకుండా ప్రభుత్వం ఎన్ని ప్రచారపుటెత్తులు ప్రయోగించినా ఫలితం ఉండదు. ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా పేదరికం పోకుండా ఈ సమస్యలు పరిష్కారం కావు. పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించినపుడే భావిభారత పౌరులు ఉన్నతంగా తయారవుతారు. విద్యావంతులు, ఆరోగ్యవంతులూ అయిన బాలలున్న దేశమే అభివృద్ధి పథాన నడుస్తుంది. ●

సిఐటియు కృషి

రాష్ట్రంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఐఎల్ఓ ఎంచుకున్న ఆరు జిల్లాల్లో హైదరాబాద్ మహానగరానికి చుట్టూ విస్తరించి ఉన్న రంగారెడ్డి జిల్లా ఒకటి. ఇది హైదరాబాద్ శివారు జిల్లా కనుక ఇతర జిల్లాల నుండి వలస వచ్చే వారంతా రంగారెడ్డి జిల్లాలోనే స్థిరపడుతున్నారు. దీంతో బాలకార్మికులు కూడా ఈ జిల్లాలోనే ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో ప్రత్యేకించి పనిచేస్తున్న ఒక స్వచ్ఛంద సంస్థకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించినా దానివల్ల ఫలితం కలుగలేదు. ఐఎల్ఓ రంగ ప్రవేశం చేసినతర్వాత చేపట్టిన పథకంలో రంగారెడ్డి జిల్లాలో బాలకార్మికవ్యవస్థ నిర్మూలనకు జరిగే ప్రచారాన్ని సిఐటియు స్వీకరించింది. సంఘటిత, అసంఘటిత రంగంలో కార్మికుల కనీస వేతనాల కోసం పోరాడే సిఐటియు ఈ పోరాటంలో భాగంగానే బాలకార్మికవ్యవస్థ నిర్మూలనకోసం కూడా ప్రచారం చేస్తోంది. తమ యూనియన్ చేపట్టాక జిల్లాలో బాలకార్మికవ్యవస్థ ఒక సమస్యగా ముందుకు వచ్చిందని రంగారెడ్డి జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డి.జి. నరసింహారావు చెప్పారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో 140 కేసులు పెట్టగా 70 శాతం కేసులు పరిష్కరించబడ్డాయన్నారు. యజమానుల వద్ద 10 లక్షలకు పైగా జరిమానా రూపంలో వసూలుచేశారన్నారు.


బాల్యం బజారున పడి చిలక జోస్యం చెబుతోంది

* శ్రీ చరణ్‌మిత్ర

ఢమరుకం

ఎర్రయ్య మనసెక్కడెక్కడకో పరుగులు తీస్తోంది.

'ఎన్నాళ్ళగానో ఎదురు చూస్తోన్న ఈ రోజు అతనికి ఇంత వేగంగా వచ్చేసిందా' అన్న ఆత్రుతగా ఉంది. ఈ ఊరు, ఈ మనుషులు, ఈ బానిస చాకిరీ నుండి తాను విముక్తుడై, విహంగంలా తన బిడ్డలుండే చోటుకి వెళ్ళడానికి అతని మనసు ఉవ్విళ్ళూరుతోంది.

స్టేషన్‌లో టికెట్ కొని నింపాదిగా ఆగిన రైలెక్కాడు.

తన కొడుకులు, కూతురు పెద్ద పట్టణంలో చదువుకున్నారు. అవి మరేమంత పెద్ద చదువులు కాకపోయినా వారికి అక్షర జ్ఞానం కల్పించానన్న సంతృప్తి ఎర్రయ్యకు మిగిలింది.

ఎర్రయ్య అనబడే ఆ పల్లెటూరి ఆసామి మదిలో ఇన్ని ఆలోచనలు ఇరవై ఏళ్ళ క్రిందటే రావడం ఒక విచిత్రం.

అదొక చిత్రమైన పరిస్థితి. ఆ పరిస్థితి నుండి తన బిడ్డలను కాపాడుకోవడం కోసం వారిని పట్టణం పంపించి చదివించాడు ఎర్రయ్య.

వారి కులంలో చాలా మంది గతంలో చేతిలో శంఖం, ధమరుకం ధరించి ఊరూరా తిరిగి బిక్షాటన చేసేవారు. అదొక వృత్తిగా కాకపోయినా, ఆచారంగానైనా చేయాలని ఎర్రయ్య తండ్రి ఎల్లమంద పట్టుదల.

రోజులు మారిపోయాయి. మనుషులు మారిపోయారు.

ఈ కాలంలో బుడబుక్కల ఫకీర్లనూ పగటి వేషగాళ్ళనూ, గంగిరెద్ల వాళ్ళనూ, జంగమ దేవర్లనూ జగతి పట్టించుకోవడం మానేసింది.

అయినా ఊరి బాగు కోసం సంక్రాంతికో, శివరాత్రికో ఎర్రయ్య కుటుంబం అర్ధరాత్రి కాణ్ణించి తెల్లవారి వరకూ శంఖం ఊదుకుంటూ, ధమరుకం వాయించుకుంటూ తిరగాలి. లేదంటే ఊరికి అరిష్టం... 'తిరక్కపోతే మనకూ అరిష్టమే' అని నమ్మే ఎల్లమందకు ఎర్రయ్యకు ఆ విషయంలోనే పెద్ద గొడవ జరిగింది.

ఆ రోజు సంక్రాంతి.

ఎర్రయ్య భార్య గంగమ్మ పెట్టిన కేకతో నిద్రలేచిన ఎర్రయ్య నులకమంచం కోడు పక్కన ఒద్దికగ్గా దాచుకున్న చుట్టముక్కను తీసి తాపీగా వెలిగించుకుంటూ - "పోలయ్య ఏడే గంగీ" అనడిగాడు ఎర్రయ్య. పోలయ్య ఎర్రయ్య పెద్ద కొడుకు.

"ఇంకెక్కడ పోలయ్య. మీ అయ్యతో అర్ధరేతిరే నేసిపోయి మేలుకొలుపుకు రేతిరే ఎల్లిపోనాడు" అంది. ఎర్రయ్య ముఖం కాలుతున్న చుట్ట మంటకన్నా మరింతగా ఎర్రబడింది.

"సై... దొంగనాయాలు.. ఎంత సెప్పినా బుద్ధిరాదు. బేవార్సు నాయాలూ... అడుక్కుని తినడవంటే ఎంత యావో ఎదవ నాయాలుకి. పండగపూట రేతిరంతా ఇంటింటికి సలిలో తిరగమని ఈ ముసలి నాయాలుకి ఎవడు సెప్పిండు? పోయినోడు పోకుండా ఆ యెదవ యేషాన్ని నా బిడ్డకు ఏయించి ఊరంతా తిప్పిస్తాడా? రానీ, నాయాల్ది... ముసలి నా కొడుక్కి కాళ్ళూడగొట్టేస్తాను" అంటూ కోపంతో ఊగిపోసాగాడు ఎర్రయ్య.

"పోన్నే మాఁవా! కులవిరితి (వృత్తి) సేసుకుంటే తప్పేంటి? ఊరి సేమం కోసరం మనోళ్ళంతా ఆ పని సేసెటోళ్ళే కదా! నాలుగు మెతుకులు నోట్లోకి ఎలతన్నాయని ఈ రోజు మానేత్తావేటి?" అంది గంగమ్మ.

"నోరుముయ్యే.... బుడబుక్కలు వాయించకపోతే ఊరు బాగుపడదేటే? మనం శంఖం ఊదకపోతే ఊరు మేలుకోదా! అప్పుడెప్పుడో మనకు ఇల్లూ, పొల్లూ లేనపుడు అలా అడుక్కున్నామంటే అర్థం ఉంది. ఇపుడు బతకడానికి మనకు ఇంత దారకం దొరికినాది కదా! ఇప్పుడేం దొబ్బుడు? ఇంకా అడుక్కోడానికి" అంటూ ఎర్రయ్య చెబుతుండగా–

ఎర్రయ్య తండ్రి ఎల్లమంద మనవడితో వచ్చాడు.

తలకు తలపాగా, నుదుట తిరునామం. చేతిలో ధమరుకం. కాలికి గజ్జెలతో తాతతో పోటీ పడుతున్న పోలయ్య వేషం చూసేసరికి ఎర్రయ్యకు అరికాలి మంట నెత్తికెక్కింది.

"నా కొడకా, సదూకోమని సెబితే నీవు యేషాలు కడతావురా" అంటూ పోలయ్యను పట్టుకుని గుంజేసాడు ఎర్రయ్య తరువాత ఎల్లమంద అరుపులు... గంగమ్మ కేకలతో అక్కడొక యుద్ధ వాతావరణం అలముకుంది.

"ముసలి నా కొడుక్కి యెదవ యేషాలు ఏయించడానికి నా కొడుకే దొరికినాడు గావాల.. సంపేత్తాను ఈడ్ని ఈయాల" అంటూ కోపంతో ఊగిపోతూ ఉగ్రంగా తయారయ్యాడు ఎర్రయ్య.

"నానేటి సేసినాన్రా! మన కులవిరితి పెకారం ఒకరోజు గంటడిసేత మేలుకొలుపు పాడించా. ఇందులో తప్పేటి?" అన్నాడు ఎల్లమంద తన ధోరణిలో

"నాకిట్టం లేదురా... నా కొడుకులు అలా యేషాలు కట్టడం, పాటలు పాడటం నాకసలు ఇట్టం (ఇష్టం) నేదు. ఆళ్లు దర్జాగా మారాజుల్లా బతకాల. ఊరంతా సుఖంగా పడుకుని నిద్దరోతన్న యేళ ఆళ్ళని మేలుకొలిపే ఎర్రి ఎంగళప్ప బతుకులు నా బిడ్డలు బతకడానికి ఈళ్ళేదు (వీలుల్లేదు). ఇంట్లోంచి బయటకు రాకుండా సాంపరదాయికంగా (సాంప్రదాయకంగా) బతికే దొరసానుల్లా నా కూతుళ్ళు బతకాల"

చుట్టూ చేరినోళ్లలో ఒకడు ఫక్కున నవ్వాడు.

చీకటి వలయంలా దారిద్ర్యానికి తరతరాల ప్రతినిధులు గుమిగూడి ఎవరికి తోచినట్లు వారు చెబుతున్నారు.

"మన బతుకులేటి? మనవేటి? బయటకు రాకుండా మారాజుల్లా బతకాలంటే పొట్ట గడవొద్దా? ఎర్రయ్యకు నిజంగానే ఎర్రి పట్టేసినాది" అన్నాడు నవ్వినోడు.

"నిజమే మీ దగ్గరుంటే నిజంగానే ఎర్రిపడతాది. కులవిరితి అనే ఎర్రిపడతాది. అది నా బిడ్డలకి కూడా ఎక్కించేస్తారు. అందుకే నా బిడ్డల్ని ముగ్గుర్నీ పట్టణం తోలేత్తాను. మా బావమరిది పట్టణంలో రిక్షా తొక్కి ఆడి పిల్లలను సదివిత్తున్నాడు. ఆడి పిల్లలతో పాటే నా పిల్లలనూ అక్కడ సదివిత్తాను. ఆ పట్టణంలో సుబ్బరంగా సదువుకుంటారు. ఇక్కడుంటే ఆళ్ళని మీరే ఎదవ యేషాలు ఏయించి సెడగొట్టేస్తారు" అంటూ ఇంట్లో భార్య, తండ్రి ఎంత పోరుతున్నా తన ఇద్దరి కొడుకుల్నీ, ఒక కూతుర్ని పట్టణం పంపించాడు. కాయకష్టం చేసి తను సంపాదించిన సొమ్ముతో వారిని చదివించానన్న ఆత్మసంతృప్తితో బ్రతికాడు ఎర్రయ్య కాలక్రమంలో గంగమ్మ, ఎల్లమంద కూడా చనిపోయారు.

బిడ్డల గూటికి చేరాలనే తాపత్రయంతో అలాంటి తండ్రికి ఆ మాత్రం ఆతృత ఉండడంలో తప్పేం లేదు కనుక కరెక్టు టైముకే రైలు కూత వేసింది.

* * *

"ఏదో ఆళ్ళు సదువుకున్న కాడికి నీ బిడ్డల్ని

సదివించానురా! ఇందులో నా గొప్పతనమేముంది? ఊరికే నన్ను పొగిడేయమాకు" అన్నాడు ఎర్రయ్య బావమరిది పోలిపల్లి.

"నువ్వే గనుక ఈ పట్టణంలో ఉండకపోతే... వాళ్ళు అచ్చరం ముక్క అబ్బకుండా మనలాగే ఉండేవోరు. ఇదంతా నీ సలవే" అన్నాడు కృతజ్ఞతగా ఎర్రయ్య పోలిపల్లితో.

"సర్లే ఎప్పుడు తిన్నావో ఏటో రా అన్నం తిందూగానీ" అన్నాడు ఎల్లమంద వద్దురా పిల్లలు రానీ, ఆల్లతో కలసి భోంచేత్తాను"

"ఆలెప్పటికో వత్తార్లేరా... రా ముందు నువ్వు అంటూ పోలిపల్లి చెప్పడంతో భోజనానికి లేవక తప్పింది కాదు ఎర్రయ్యకు."

అన్నం తిని పడుకున్న ఎర్రయ్య కంటిమీద కునుకు పట్టడం లేదు.

ఏవేవో ఆలోచనలు అతని మదిలో మెదులుతున్నాయి.

తను ఆ ఊరి వంతులుగారింట్లో చూసేవాడు. కొడుకు, కోడలు, పంతులుగారూ ఉద్యోగాలకి ఒకరి తరువాత ఒకరు టైమ్మీద వెళిపోతుంటే తనకి ఎంతో ఆనందం కలిగేది. మళ్ళీ సాయంత్రం ఎంతో సంతోషంగా అందరూ ఇంటికి చేరుకుంటే ఎంతో సందడిగా ఉండేది.

ఇపుడు అలాంటి పరిస్థితి తన బిడ్డల్లో ఏర్పడినందుకు ఎర్రయ్య మనసు ఆనందంతో పులకించిపోతోంది. వెలిగే సూర్యుడు నల్లని కొండల మధ్య కనుమరుగవుతున్నాడు. చీకట్లు చిక్కగా అలముకుంటున్నాయి. కానీ ఇంతవరకూ పిల్లలెవరూ ఇంటికి వచ్చిన దాఖలాలు కనిపించలేదు ఎర్రయ్యకు.

"సీకటి పడుతున్నా అమ్మలు కూడా రాలేదేంట్రా... పోలీ" అనడిగాడు ఎర్రయ్య అసహనంగా.

"వచ్చే వేళగానీ పనుంటే ఆలిస్యం అవుతాది" చెప్పాడు పోలిపల్లి.

మరో రెండు గంటలు గడిచాక-

తెల్లని పాలనురగ లాంటి చొక్కాపై, నల్లని ఫేంట్ ఇన్‌సర్ట్ చేసి, దానిపై అందమైన టై కట్టుకుని, నల్లని బూట్లు టకటకలాడించుకుని వస్తున్న తన పెద్దకొడుకు పోలయ్యను చూసి అప్రయత్నంగా లేచి కూర్చున్నాడు ఎర్రయ్య.

"నువ్వెప్పుడొచ్చావయ్యా... బాగున్నావా? ఉండు బాగా అలసిపోయాను. ముఖం కడుక్కుని వస్తాను." అంటూ తన భుజాన ఉన్న అతి పెద్ద లావాటి బ్యాగును భారంగా దించి లోపలికి వెళ్ళాడు. కొడుకుని అలాంటి రూపంలో చూసిన ఎర్రయ్య మనసు ఆనందంతో నాట్యం చేసింది.

ముఖం కడుక్కుని బట్టలు మార్చుకుని మొఖాన్ని తువ్వాలుతో తుడుచుకుంటూ - "బాగా అలసిపోయానయ్యా.. ఇయాళ" అటూ తన మంచంపై కూర్చున్నాడు పోలయ్య.

"ఏం పన్రా పోలయ్యా" ఉత్సుకతతో అడిగేశాడు ఎర్రయ్య ఆత్రుతను చంపుకోలేక.

"సేల్స్ ప్రమోటరు అంటార్లెయ్యా... అది"

"అంటే ఏటి సెయ్యాల?"

"ఏముంది మా కంపెనీ చేసే పౌడరు, స్నోలు, టూత్‌బ్రష్‌లు, పేస్టులు, షాంపూలూ ఇంటింటికీ తిరిగి సేల్స్ పెంచాలి. ఎంత ఎక్కువ అమ్మితే అంత కమీషన్ మనకి ముడతాది"

"ఈ పనికి ఈ సూటూబూటూ ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు ఎర్రయ్య.

"మరేటి? అమ్మినోడు టిప్‌టాప్‌గా ఉండకపోతే కంపెనీ ప్రెస్టేజీ పోతాదని మా ఎగ్జిక్యూటివ్ ఇస్త్రీ కూడా నలగకూడదంటాడు. ఇది మా కంపెనీ సింబల్. ఈ బ్యాడ్జీని భుజానికి తగిలించుకుని మా కంపెనీ గురించి ప్రచారం చేస్తూ ఈ వస్తువులు అమ్మాలి. ఇక్కడ ఇపుడు బతకాలంటే కంపెనీవోడు ఏ వేషం ఎయ్యాలంటే అదెయ్యాల" అంటూ చెప్పుకొచ్చాడు పోలయ్య.

ఎర్రయ్య మనసు ఒక్కసారిగా చివుక్కుమంది.

ఇంటింటికి తిరిగి వస్తువులు అమ్ముకోవడానికా తన కొడుకుని పట్నం పంపించి చదివించింది.

తన భార్య కూడా ఇంటింటికి తిరిగి పూసలు, అద్దాలు, సూదులు అమ్ముకొనేది. అదలా ఇంటింటికి తిరిగి అమ్మకూడదని తాను అప్పట్లో మానిపించేశాడు.

తన కొడుకు బియ్యే చదివి మళ్ళీ అలాంటి పనే చేస్తున్నాడు.

మనసు మూలల్లో ఎక్కడో తెలియని బాధ కలుగుతోంది. ఆ బాధనుండి ఇంకా అతను తేరుకోకముందే చిన్న కొడుకు ఇంట్లోకి ప్రవేశించాడు.

దీపం వెలుగులో వాడి మొహాన్ని పట్టి పట్టి చూశాడు ఎర్రయ్య. ముఖమంతా పీక్కుపోయి కాలుతున్న కళ్ళతో వచ్చిన చిన్నకొడుకుని చూసి బిత్తర పోయాడు ఎర్రయ్య. కాకపోతే అతను కూడా ఏదో వేషంలోనే ఉన్నాడు.

ఎర్రని షర్టు, నల్లని ఫ్యాంటుపై టక్ చేసుకుని టైకు బదులుగా ఒక టోపీ పెట్టుకుని భారీగా ఉన్న నల్లని బూట్లు వేసుకుని వున్నాడు.

పలకరింపులు అవీ అయ్యాక వాడు - మా రిలీవరు రాక రెండు డ్యూటీలు నేనే చేయాల్సి వచ్చింది నాన్నా అక్కడ్నించి సైకిలు మీద వచ్చేటప్పటికి ఇలా వళ్ళంతా చెమటలు పట్టేస్తాయి ఉతుక్కుంటే బావుంటుందని డ్యూటీ డ్రెస్‌తో వచ్చేశాను" అంటూ ఆయాసంగా చెప్పుకొచ్చాడు చిన్నకొడుకు.

"ఇంతకీ ఏ పనిరా అయ్యా" అడిగాడు ఎర్రయ్య.

"సెక్యూర్టీ నాన్నా"

"అంటే?"

"కాపలా నాన్నా! కాపలా, పెద్ద పెద్ద ఆఫీసర్లు... మానేజర్లు ఉండే ఒక పెద్ద అపార్టుమెంటు దగ్గర నిలబడి కాపలా కాయడమే"

ఉలిక్కిపడ్డాడు ఎర్రయ్య.

"అంటే అందరూ నిద్దరోతుంటే నీవు కాపలా కాయాలా ?" ఆత్రుతగా అడిగాడు.

"నైట్ డ్యూటీ పడితే అంతే మరి"

"సంవత్సరానికి ఒకసారి ఊరి బాగుకోసం 'మేలుకొలుపు' చేయించిన తన అయ్యతో తాను తగువుపడ్డాడు. తన కొడుకు ఇప్పుడు రోజూ రాత్రంతా మేలుకొని ఉన్నవారికి కాపలా కాస్తున్నాడు' అని ఊహించిన ఎర్రయ్యకు సన్నగా వణుకు ప్రారంభమైంది.

"ఆ పని ఏమంత మంచి పనిరా" అన్నాడు వణికే కంఠంతో.

"మరేం చెయ్యమంటావు నాన్నా... నేను చదివిన పదో తరగతికి ఇవే పనులు ఉన్నాయి. ఈ చదువులు నీవు చదివించే కంటే ఏ సైకిలు షాపులో నన్ను పనికి పెట్టినా నాకీ బానిస బతుకు తప్పేది" అంటూ ఏవేవో చెప్పుకొస్తున్నాడు చిన్నకొడుకు.

"మా ఇద్దరి కంటే సెల్లి బతుకే బాగుంది నాన్నా అది అప్పుడప్పుడు షూటింగ్‌కి వెళుతుంది"

"షూటింగ్‌లకా" అర్థం కాక అడిగాడు ఎర్రయ్య.

"అవున్నాన్నా... సెల్లి ఈ మధ్యన టీవీ షూటింగ్‌లకి వెళుతోంది. అన్నట్లు ఇప్పుడు తొమ్మిది గంటలకి 'మోహిని' టీవీలో 'గంగిరెద్ల గెంతులు' ప్రోగ్రామ్‌లో సెల్లిలే ఉంటాది ఉండు ఆన్ చేస్తాను" అంటూ టీవీ ఆన్ చేశాడు.

టీవీలో తన కూతురుని తేలికగానే గుర్తు పట్టాడు ఎర్రయ్య.

లంబాడీ స్త్రీలు వేసుకునే దుస్తుల్లాంటివి వేసుకుని ఆడాళ్ళు, మగాళ్ళ మధ్య అంతా తానై ఊరికే జనాల్ని ఉత్తేజపరచడానికి గెంతులు వేస్తోంది. అహ, ఓహోలతో... హై.... హై వెర్రెక్కినట్లు... అచ్చం తమ కులాల్లో ఒకరైన గంగిరెద్ల వాళ్ళలో జనాల్ని ఉత్తేజపరచటానికి ఆ ఆడవాళ్ళు చేసే చేష్టలు లాంటివి చేస్తోంది.

ఒక్కసారిగా హృదయమంతా కెలికినట్లయింది ఎర్రయ్యకు.

ఉద్వేగంతో గుండెలోని దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికి రాగా బయటికే ఏడ్చేయసాగాడు ఎర్రయ్య.

"ఏటయింది... ఏమిటయింది" అంటూ కొడుకులు, బావమరిది ఎర్రయ్య చుట్టూ చేరారు.

"ఒరేయ్ పోలీ, నేనేం ఆశించాన్రా... నా బిడ్డలేటయిన్రు... నా కులవృత్తికి అలవాటైన యేషాలు ఆళ్ళు వేయకూడదని ఈళ్ళను నీకాడుకు సదువుకు పంపించినా, సదువుకుని ఈళ్ళంతా ఇంకో కొత్త వేషాలు కడుతున్నారేట్రా... ఏమిటీ అన్నేయం" అంటూ బావురుమన్నాడు.

కాసేపు గాఢంగా నిశ్శబ్దం అలుముకుంది. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఇలా చెప్పసాగేడు పోలిపల్లి "ఇదంతా ఈ దేశంలో మామూలు యవ్వారం బావా, పెభుత్వకం ఉజ్జోగాలు ఇవ్వడం లేదు. బతుకు తెరువు కూడా సూపించడం మానేశాయి. ఇప్పుడంతా ప్రైవేటు కంపెనీవోళ్ళే మనలాంటోల్లకి దిక్కయినారు. వాళ్ళు ఏ వేషం వెయ్యమంటే ఆ వేషాలు వెయ్యక తప్పడం లేదు. సరైన జీతభత్యాలు లేకపోయినా పొట్టకూటికోసం వాళ్ళేం చెయ్యమంటే అది చేయక తప్పటం లేదు.

నువ్వింక సూడలేదేమో, ఇక్కడ నిరుద్యోగులైన పిల్లల్ని రకరకాలుగా ఉపయోగించుకుంటున్నారు. నీలిమందు రంగు కంపెనీ అమ్మకాలైతే తెల్లరంగు గుడ్డలేయించి ప్రచారం చేయిస్తారు. సబ్బు ఎరుపు రంగుదైతే ఆ రంగు గుడ్డలేయించి వీధిలోకి తోసేత్తారు.

దీపావళి, సంకురాత్రి లాంటి పండుగ దినాల్లో వస్త్రాల మేళాలంటూ రకరకాల బఫూన్ల వేషాలు. రామ చిలకల తొడుగులు, ఎలుగుబంటి వేషాలు పనిలేనోళ్ళ కందరికీ ఆ పూట కూలీ ఇచ్చి తాము ప్రచారం చేసుకుంటున్నారు.

అంతెందుకు హైవే రోడ్డుల మద్దిన రంగుబుడ్డి (కూల్‌డ్రింక్స్) సీసాల అమ్మకానికి ఆడకూతుర్లని గుడ్డగొడులు వేసి నడిరోడ్డులో కూచోపెడుతున్నారు. ఇప్పుడంతా వ్యాపారం.

ఒకప్పుడు మనలను మనకు నచ్చేటట్టు మనం దిద్దుకునే వాళ్ళం. కాని ఇప్పుడా అవకాశం లేదు. మనం బతకడానికి ప్రెయివేటోళ్ళే ఏవేవో యేషాలు వేయిస్తున్నారు. ఏయక తప్పడం నేదు" అంటూ ఏదేదో చెబుతుండగా-

భారమైన గుండెతో - తడబడే అడుగులతో బయటకు నడిచి నులకమంచం మీద కూలబడ్డాడు.

అక్కడక్కడ నక్షత్రాలు మిణుకుమిణుకు మంటున్నా ఆకాశం అంతా చీకటిగానే ఉంది. ●

* పుప్పాల కృష్ణమూర్తి

మోసం

శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని పాలిస్తున్న రోజులవి. ఆ రాజ్యంలో లంకెపల్లి అనే చిన్న గ్రామం వుంది. ఆ ఊళ్లో శివమ్మ అనే ముసలమ్మ నివసిస్తుండేది. ఆమెకు మనవడు చెన్నప్ప, రెండెకరాల పొలం తప్ప ఏమీ లేవు. ఆ పొలంలో శివమ్మ తండ్రి చిన్ననాడు నాటిన అనేక చెట్లు వున్నాయి. అన్నీ మహావృక్షాలై జీవితకాలం ముగిసినట్లుగా ఎండిపోసాగాయి. అప్పుడు ముసలమ్మ మనవడితో ఆ చెట్లన్నీ నరికించి కలపను పట్నంలో అమ్మింది. పదిహేనువేల వరహాలు వచ్చాయి. అంత డబ్బు తమ దగ్గర వుంటే ప్రమాదమనిపించిందామెకు. అదే ఊరిలో వున్న షావుకారు రామప్ప దగ్గర దాచుకోవాలనుకుంది. వెంటనే రామప్ప ఇంటికి వెళ్లి 'ఈ పదివేల వరహాలు మీ దగ్గర వుంచండి. అవసరం పడినప్పుడు వచ్చి తీసుకుంటాను' అని పదివేల మూట అప్పచెప్పింది. మిగిలిన ఐదువేలతో రెండు ఎకరాల భూమిని శుభ్రం చేయించింది.

'ఏ పంట వేద్దాం అమ్మమ్మా?' అనడిగాడు చెన్నప్ప.

'మనుషులు మోసం చేయొచ్చుకాని మానులు మోసం చేయవయ్యా. అందుకే ఇది నాటుతున్నాను. మా నాన్న ఆ రోజు చెట్లు నాటాడు. వాటి వల్లే మనకు పదిహేను వేల వరహాల ఆదాయం వచ్చింది. అందుకని చెట్లనే నాటుదాం' అంది.

ఆరోజే రెండు ఎకరాల నిండా మామిడి టెంకెలు నాటారు. అవి మొక్కలై క్రమేపీ ఎదగసాగాయి. వారి పొలం పక్కనున్న ఐదు ఎకరాల భూమిని ఓ రైతు అమ్ముకోవాలనుకున్నాడు. శివమ్మ దాన్నికూడా కొని అందులోనూ మొక్కలు నాటుదామని నిర్ణయించుకుంది. ఒకనాడు ఉదయమే వెళ్లి రామప్పతో విషయం చెప్పి తాను ఆనాడు ఇచ్చిన పదివేల వరహాలు ఇవ్వవలసిందిగా కోరింది. 'వరహాలేంటి? నువ్వు నాకివ్వడమేంటి? ఏదీ, ఏమన్నా ఆధారముంటే చూపించు' అని బుకాయించాడు.

'ఆధారాలేమీ లేవు. మాటే మనకు ఆధారం. మాట తప్పిన మనిషి పశువుతో సమానం' అంది శివమ్మ.

'నీలాగే రేపు మరొకరు వచ్చి డబ్బు ఇచ్చానంటే ఇవ్వాలా? ఇలా ఇస్తూ పోతుంటే నా దగ్గరేం మిగలదు. మీ దగ్గర ఏవన్నా ఆధారాలుంటే చూపించండి. అలా చూపించకుంటే నేను డబ్బు ఇవ్వను' అని నిక్కచ్చిగా చెప్పాడు షావుకారు.

'సరే మంచిది. నేను కష్టపడ్డ సొమ్మయితే నాకు తిరిగి వస్తుంది. అక్రమంగా ఆర్జించినదైతే నాకు దక్కదు' అని మనవడిని తీసుకుని ఇంటికి వెళ్లింది.

'షావుకారు చేసిన మోసాన్ని రాజుగారికి కాని మన ఊరి న్యాయమూర్తికి కాని చెబుదాం' అన్నాడు చెన్నప్ప.

'అది కష్టపడి సంపాదించిన సొమ్మురా. ఎప్పటికైనా మనకు చేరుతుంది. సమయం రానీ' అంది శివమ్మ.

పదేళ్లు గడిచాయి. మామిడి మొక్కలన్నీ వృక్షాలై కాయలు కాయసాగాయి. తొలిపంటను రాజుగారికి కానుకగా సమర్పించాలనుకున్నారు ముత్తవ, మనవడు. మామిడి పండ్లను ఓ బుట్టనిండా తీసుకెళ్లి రాజసభలో స్వీకరించమని కోరారు. రాయలు వాటిని తీసుకుని ఒక పండు తిన్నాడు. అది ఎంతో మధురంగా అనిపించింది. మరో పండును వెంటనే తిన్నాడు. అది మరీ మధురంగా అనిపించింది. వెంటనే రాయలు 'మీకు ఎన్ని మామిడి చెట్లున్నాయో, ఆ చెట్లకు కాసిన పండ్లన్నిటినీ మా రాజప్రసాదానికే పంపండి. ఇదిగో ఈ కానుక గ్రహించు' అని వేయి వరహాలు ఇచ్చాడు. శివమ్మ పొంగిపోయి తమరు కోరిన ప్రకారమే పంపుతానని సెలవు తీసుకుంది.

ఆ రోజు మొదలు ప్రతిరోజూ పండిన పండ్లన్నీ గంపకెత్తుకుని, అంతఃపురంలో ఇచ్చేది.

శివమ్మ తనతోటలోని మామిడిపండ్లను రాజుగారికి ఇస్తోందని తెలియగానే గ్రామస్థులందరి దృష్టి ఆమెమీద పడింది. ప్రతి ఒక్కరూ ఆమెను ఎంతో గౌరవంగా చూడసాగారు. మరికొందరు తమకున్న బాధల్ని, మంచి సమయం చూసి రాజుగారితో చెప్పమని వేడుకోసాగారు.

రామప్పకు శివమ్మ గురించి తెలిసి భయపడిపోయాడు. నిద్రపట్టలేదు. 'ఈ ముసల్ది రాజుతో నా మీద చెప్పిందంటే మరణ శిక్ష ఖాయం' అనుకున్నాడు. ఆ రాత్రి తనకు మరణ శిక్ష విధించినట్లు తలారులు ఉరితీస్తున్నట్లు కలగన్నాడు. అతను మరునాటి ఉదయమే శివమ్మ ఇంటికెళ్లి 'డబ్బు మూట కనిపించింది. దీనిమీద నీ పేరే రాసి వుంది. ఆ రోజు నాకు జ్ఞాపకం లేక నీ డబ్బు నీకివ్వలేకపోయాను. మన్నించు. నామీద రాజుగారికి చెప్పకు' అని బతిమిలాడుకుని మూటను చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

'చూశావా మనవడా! మనం కష్టపడ్డ సొమ్మయితే మనకు తిరిగి వస్తుందని చెప్పాను. వచ్చింది. మనుషులు మోసం చేయవచ్చుకాని మానులు చేయవు' అని చెప్పి ఆనాడు విత్తనాలు నాటాను. అవి మోసం చేయకుండా ఇవాళ ఫలాల్నిచ్చాయి. అవే మనకు పొట్ట నింపుతున్నాయి' అని గర్వంగా చెప్పింది. ●



ఎమ్.రవి, 6వ తరగతి,
యస్‌బిహెచ్‌స్కూల్,
పెద్దాపురం.



సిహెచ్. హరీష్,
జడ్‌పిహెచ్ స్కూల్,
చినకాకాని.

చిన్నారి చిత్రకారులు

ఎ.సతీష్,
4వతరగతి,
ఆంధ్రా పబ్లిక్ స్కూల్,
విశాఖ.

అంతటి నరేష్‌కుమార్,
10వ తరగతి, వెలిమనేడు,
నల్లగొండ.

క్విజ్-82

1. 'ది గైడ్ ' రచయిత ఎవరు?
   ఎ. ఆర్.కె.నారాయణ్ బి. పెరల్ యస్ బక్
2. అరిస్టాటిల్ ఎవరు?
   ఎ. ప్లేటో శిష్యుడు బి. సోక్రటీస్ శిష్యుడు
3. అంకుల్ శామ్ అని ఎవరిని పిలుస్తారు?
   ఎ.అమెరికన్ పౌరుడు బి. ఆంగ్ల సైనికుడు
4. హిమాచల్‌ప్రదేశ్ రాజధాని?
   ఎ. లక్నో బి. సిమ్లా
5. భూమినుంచి దూరముగా వున్న గ్రహము?
   ఎ. కుజుడు బి. శని
6. భూమి తన చుట్టూ తాను తిరగడానికి పట్టు గంటలు?
   ఎ. 34 బి. 24
7. ఆమ్లములు నీలి లిట్మసును ఏ రంగులోకి మారుస్తాయి?
   ఎ.ఎరుపు బి. ఆకుపచ్చ
8. మన రాష్ట్రపతి పదవీ కాలము ఎంత?
   ఎ.5
   బి.6
9. ఆరోగ్యంగా వున్న మానవుని గుండె ఎన్ని సార్లు కొట్టుకుంటుంది?
   ఎ. 70-84
   బి. 80-84
10. ఈ ఫొటోలోని వ్యక్తి పేరేమిటి?
    ఎ. చంద్రప్రకాష్ ద్వివేది
    బి. సఫ్దర్ హష్మి

కాగితపు చలన చిత్రం



మేజిక్! మేజిక్!

హాయ్! కాగితంతో చలనచిత్రం చేసి చూపించగలరా? మీ వల్ల కాదా. అలా అయితే మేమే చెప్తాం. జాగ్రత్తగా చదివి మీరూ చేయండే.

ఈ కాగితపు చలనచిత్రం తయారు చేయడానికి కావలసిన వస్తువులు: 2 సెంటీమీటర్ల పొడవు, 7 1/2 సెంటీమీటర్ల వెడల్పు వున్న కాగితం నలుపురంగు స్కెచ్ పెన్ను లేదా పెన్సిల్.

తయారు చేసే పద్ధతి: ముందుగా కాగితం తీసుకుని మధ్యకు మడవండి అడుగుకాగితంమీద పై పటంలో చూపించిన 2వ బొమ్మను గీయండి. కాగితంమీద పై పటంలో చూపించిన 3వ బొమ్మ గీయండి. గీశారా! ఇప్పడు పై కాగితాన్ని చుట్టండి. బొమ్మలో కనిపిస్తోందే అలా. ఎడమకొనపై మీ ఎడమవేలు గట్టిగా వుంచి మీ కుడిచేత్తో పెన్సిల్ పట్టుకు చుట్టిన కాగితంలో దూర్చండి. ఇప్పడు పెన్సిల్‌ను పైకీ కిందికీ వేగంగా జరపండి పై మడత చుట్ట విడిపోతూ మళ్లీ చుట్టుకుంటూ వుంటుంది. గమ్మత్తయి ఒక చిన్న చలనచిత్రం కనిపిస్తుంది. కనిపించిందా. ఇదే కాగితంతో చే చలనచిత్రం. వచ్చేవారం మరో మేజిక్ చెప్పకుందామే.

రంగులు అద్దుతారా!

క్విజ్ 81కి జవాబులు

1. నాగాలాండ్ 2. సత్యము 3. ఏనుగు
4. నెహ్రూ జన్మదినం 5. హైదరాబాదు 6. జల
7. నైలు 8. మేడమ్ క్యూరీ 9. ఆల్‌ఫ్రెడ్ నోబెల్
10. అంజలి భగవత్

క్విజ్ 80కి సరైన సమాధానాలు రాసిన వారు :

వి.పుల్లారావు, కృష్ణ, వి.యేసేబు, 10వ తరగతి, జిఎమ్ఎస్ స్కూల్, యర్రగొండపాలెం, ప్రకాశం.
టి.తేజేష్, పడాల అనిల్ కుమార్, 8వ తరగతి, ఎస్‌విఎన్‌ఆర్‌స్కూల్, మెంతిపేటకాలనీ, రాజాం.
ఎస్‌కె. కరీముల్లా, 9వ తరగతి, విద్యానగర్, గుంటూరు.
పి.విమల, 9వ తరగతి, పాత గాజువాక, విశాఖ.
జి.విష్ణుకుమార్, 7వ తరగతి, అరకు, విశాఖ.

కలం స్నేహం

పేరు: డి.మౌనిక
వయసు : 10 సం॥
చదువు : 5వతరగతి
హాబీలు : పుస్తకాలు చదవడం, బొమ్మలు వేయడం.
పూర్తి చిరునామా : డి.మౌనిక, డాటరాఫ్ డి.ప్రసాద్, వేటపాలెం, చీరాల.

పేరు: సి.అన్వేష్,
వయసు : 12 సం॥
చదువు : 7వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు, మంచి పుస్తకాలు చదవడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : సి.అన్వేష్, సన్నాఫ్ లక్ష్మయ్య, బిడేకన్నె, మెదక్. **502246.**

హాయ్... మీక్కూడా కలం స్నేహం చేయాలని వుందా! మరి ఆలస్యం ఎందుకు. ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే.
మా చిరునామా : బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

తివాచీ - రూపాయల పళ్లెం

అక్బర్-బీర్బల్ కథలు



పాదుషావారు దర్బారులో కూర్చున్నారు. వారికి ఒక పక్కగా రాజోద్యోగులు, మరొకపక్క పండితులు కూర్చున్నారు. అక్బరు సభనంతా పరికించి చూశారు. ఆయనకో చిలిపి ఆలోచన వచ్చింది. వెంటనే భటుని పిలిచి ఓ తివాచీ ఒక రూపాయిల పళ్లెం తెప్పించారు. తివాచీని అక్కడ పరిపించి ఆవలవైపున రూపాయల పళ్లెం పెట్టించారు. భటుడు ఆయన చెప్పినట్టు చేశాడు.

అక్బరు అందరివైపు చూచి 'నేను మీకు ఈ రూపాయల పళ్లెరాన్ని బహుమతిగా ఇవ్వాలనుకుంటున్నాను. అదీ నేర్పు- యుక్తి కలవారికి మాత్రమే సుమా! కాబట్టి ఈ తివాచీ తొక్కకుండా, అటుపక్కనుంచి వెళ్లకుండా తివాచీకి ఆవలి వైపునున్న ఆ పళ్లెరాన్ని తెచ్చుకోండి' అన్నారు.

'అటూ ఇటూ వెళ్లకుండా తివాచీ తొక్కకుండా ఎలా తివాచీ దాటాలి?' అన్న సందేహంతో ఎవ్వరూ వెళ్లలేదు. బీర్బల్ లేచి 'ప్రభూ! నేను వెళ్లి తీసుకుంటాను' అని అక్బరు అనుమతి పొందాడు. వెంటనే తివాచీని చుట్టుకుంటూ వెళ్లి రూపాయల పళ్లెరాన్ని తీసుకున్నాడు. తిరిగి తివాచీని పరుచుకుంటూ వచ్చి తన ఆసనంలో కూర్చున్నాడు. బీర్బల్ యుక్తికి అక్బర్‌తోసహా సభలోనివారంతా ఆశ్చర్యపోయారు. తర్వాత సంతోషంతో పెద్దగా చప్పట్లు చరిచారు.

కరెంటు చేప

కరెంటు ఉత్పత్తి చేసే చేపలు వున్నాయి తెలుసా. ఇలాంటి చేపల్లో సుమారు 500 రకాలున్నాయి! వీటన్నిట్లోకీ ఎక్కువ కరెంటు వుండే చేప విద్యుత్ 'ఈల్'. సన్నగా, పొడవుగా వుండే ఈల్ చేపల్లో విద్యుత్ లేనివికూడా వున్నాయి. కానీ విద్యుత్ ఈల్ నిజమైన ఈల్ కాదు, ఈల్ లా కనిపించే మరో చేప. ఈ చేప దక్షిణ అమెరికాలోని బురద నదులలో వుంటుంది. దాదాపు రెండున్నర మీటర్ల పొడవు పెరుగుతుంది. ఈ చేపలో మూడు జతల విద్యుత్ పరికరాలుంటాయి. ఇవి కొన్ని రకాల కండర కణాలతో తయారౌతాయి. వీటినుంచి దాదాపు 650 వోల్టుల శక్తి వెలువడుతుంది. అంత విద్యుత్‌కి మనమైతే షాక్ తింటాం. చేపలైతే చనిపోతాయి. కాని ఈల్ చేప రక్షణకే కాక సంకేతాలకీ, నీటికింద అన్వేషణకీ విద్యుత్‌ని ఉపయోగిస్తుంది. ఇంతకీ ఈ విద్యుత్ ఈల్ శాస్త్రీయ నామవేంటో తెలుసా? ఎలక్ట్రో ఫోరస్ ఎలక్ట్రికస్.



✻ శేషు

ప్రాణదాతలు



అదో సర్కారు దవాఖానా.. రోగులు లోపలికి వెళుతున్నారు, బయటకు వస్తున్నారు.. డాక్టర్లను దేవుళ్ళంటూ పొగుడుతూ కొందరు బయటకు వస్తున్నారు.. ఈ దవాఖానాలో ఏ మందులూ ఉండవంటూ నీరసంగా, గొణుక్కుంటూ చీటీని, చేతిలో ఉన్న డబ్బును చూసుకుంటూ వచ్చేవారూ కనిపిస్తున్నారు.

లోపల మరో దృశ్యం....

ఓ నలభై సంవత్సరాల మహిళకు ఆపరేషన్ చేయాలి. ఆమెకు రక్తం కావాలి. ఆ మహిళతో పాటు వచ్చిన వారు రక్తం ఇచ్చే పరిస్థితిలో లేరు. అవసరానికి బ్లడ్‌బ్యాంక్‌లో ఆమెకు సరిపోయే గ్రూప్ రక్తం లేదు. అక్కడున్న జూనియర్ డాక్టర్ ఒకరు ఆమె రక్తం గ్రూప్ తెలుసుకుని తన రక్తం కూడా అదే గ్రూప్ అన్నాడు. ఆమెకు రక్తం ఇవ్వడానికి సుముఖత తెలిపాడు. ఆ తర్వాత మరో డాక్టర్ కూడా ఆ పేద మహిళకు అవసరమైన రక్తం ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఇక ఆపరేషన్ చేయడమే తరువాయి. ఇద్దరు డాక్టర్లు రెండు ప్యాకెట్ల రక్తం ఇచ్చారు. వారే ఆపరేషన్ కూడా చేశారు. ఆపరేషన్ విజయవంతమైంది. వారం రోజుల తర్వాత ఆమె కుట్లు తీసిన తర్వాత, ఆరోగ్యంతో తనింటికి వెళ్ళబోతూ. తనకు ప్రాణదానం చేసిన దేవుళ్ళంటూ డాక్టర్లకు నమస్కారం చేసింది. ఆమెతో పాటు ఉన్న బంధువులు కూడా డాక్టర్లకు నమస్కరించి ఇంటికి బయల్దేరారు.

సర్కారు దవాఖానాలో శిశువును మార్చారు...

సర్కారు దవాఖానాలో వైద్యం అందక నిండు గర్భిణి మృతి..

ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల బాలిక మృతి...

ఇటువంటి వార్తలు తరచూ పత్రికల్లో చూస్తున్నాము. ఎక్కడో ఒకచోట జరిగే కొన్ని దురదృష్టకర సంఘటనల వల్ల మొత్తం ప్రభుత్వ ఆస్పత్రుల పైనే అపనమ్మకం, అవిశ్వాసం కలిగే విధంగా వార్తలు వెలువడుతుంటాయి. ఇటువంటి సంఘటనలు జరిగిన వెంటనే ప్రజలు సహజంగానే ఆగ్రహిస్తారు. విషయం తెలిసిన పాత్రికేయులు వాటికి తగువిధంగా ప్రాధాన్యతనిస్తున్నారు.

ఇది నాణానికి ఒక పార్శ్వం మాత్రమే.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏ చిన్న సంఘటన జరిగినా అది వెంటనే బయటకు పొక్కుతుంది. నానా రభస జరుగుతుంది. ఇక దవాఖానాలను, డాక్టర్లను తిట్టని వారుండరు.

అదే ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో లక్షల రూపాయల ఫీజు గుంజి వైద్యం సరిగా అందించకపోయినా ఖర్మ అనుకుని వదిలేస్తారు. చనిపోయిన వ్యక్తి శవాన్ని తీసుకుని ఇంటిదారి పడతారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్లక్ష్యం ఉండొచ్చు. మందులు ఉండకపోవచ్చు. వైద్యం సకాలంలో అందకపోవచ్చు. ఇటువంటి దురదృష్టకర సంఘటనలు అప్పుడప్పుడూ జరుగుతున్నాయి. అదే సమయంలో రోగుల పట్ల ఆపద్బాంధవులుగా వ్యవహరిస్తూ వారికి ప్రాణదానం చేసే వైద్యులూ మనకు ఉన్నారు. అది కార్పొరేట్ ఆస్పత్రుల్లో కాదు సర్కారు దవాఖానాల్లోనే.

గతంలో ప్రముఖంగా వార్తల్లోకెక్కిన పాతబస్తీలో హైకోర్టు పక్కనే గల ప్రభుత్వ ఆస్పత్రిలో మానవత్వానికి మచ్చుతునక అనదగిన సంఘటన జరిగింది. ఇది సాటి వైద్యులకు ఆదర్శప్రాయంగా, భ్రమల్లో ఉన్న ప్రజలకు ఉత్ప్రేరకంగా పనిచేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఆపరేషన్ అవసరమైన ఒక పేద మహిళకు రక్తం వారే ఇచ్చి ఆపరేషన్ విజయవంతం చేశారు. అయితే రక్త దానం చేసిన వైద్యులు తమ పేర్లు బయటకు రావడానికి ఇష్ట పడలేదు. ప్రచారానికి సుతరామూ అంగీకరించలేదు. ఆ ఆస్పత్రిలో ఇపుడే కాదు గతంలో కూడా అనేకసార్లు రోగులకు డాక్టర్లే రక్తం ఇచ్చిన సందర్భాలున్నాయని వారు చెప్పారు. అపాయంలో ఉన్నవారికి వైద్యం చేయడం తమ కర్తవ్యమని, అందులో భాగంగానే అపుడపుడు అవసరాన్ని బట్టి రక్తం ఇస్తుంటామని వారు చెప్పారు. చాలా మంది ఇప్పటికీ తమ బంధువులకే రక్తం ఇవ్వడానికి నిరాకరిస్తారు. బయట కొంటామని చెబుతుంటారు. రక్తం ఇస్తే బలం పోతుందని భయపడుతుంటారు.

ప్రజల్లో ఉన్న ఈ భయాన్ని పోగొట్టడానికి, వారిలో చైతన్యం పెంచడానికి అనేక సభలు నిర్వహిస్తున్నాము. అందులో భాగంగానే తాము కూడా రక్తం ఇవ్వడానికి సిద్ధపడుతున్నాము అని వైద్యులు చెబుతున్నారు.

జడ్జిఖానాగా ప్రసిద్ధమైన ఆ ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు మొత్తం వైద్యరంగానికే ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.

కొన్ని ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులు రోగులతో వ్యాపారం చేస్తూ వైద్యవృత్తికే కళంకం తెస్తున్న ఈ రోజుల్లో ప్రభుత్వ వైద్యులు చూపుతున్న ఔదార్యం అందరికీ ఆదర్శంగా ఉంది. రక్తదానం చేసే విషయంలో కొందరిలో ఉన్న భయాన్ని, భ్రమలను పోగొట్టడానికి చేస్తున్న ప్రయత్నం కూడా అభినందనీయం. ●

✻ ముదిగంటి సుజాతారెడ్డి

ఆటల స్ఫూర్తికి నవోదయం

ఎవరో డోర్ బెల్ మోగించారు. తలుపు తీస్తే ఎదురుగా మా పక్కింటి మాలిని. ముఖం సంతోషంతో వెలిగిపోతూ వుంది.

"ఏం మాలిని! చాలా సంతోషంగా కన్పిస్తున్నావు" అడిగాన్నేను.

"మీకు సంతోషంగా లేదా? ఆంటీ" అంది.

"దేనికి?" అడిగాన్నేను అర్థం కాక.

"దేనికేంటి ఆంటీ! రాత్రిమీరు ఆఫ్రో ఏషియన్ ఆటల ముగింపు కార్యక్రమం టీవీలో చూడలేదా! ఎంత గొప్పగా వుందో! మనం కూడా క్రీడోత్సవాలను గొప్పగా నిర్వహించగలమని ప్రపంచానికి చాటాం. దీంతో! ఆంటీ! నాకు చాలా సంతోషంగా వుంది!..." అంది మాలిని.

ఆమె కళ్ళు మెరిసిపోతున్నాయి.

"నిజమే! మాలిని చాలా బాగా జరిగాయి. అన్నిటికన్నా విశేషమేమిటంటే అంతవరకు కుండపోతగా వర్షించే ఆకాశం ప్రసన్నం కావటం. ఎటువంటి అపశ్రుతులు లేకుండా ఇంత తక్కువ కాలంలో అంత బాగా అన్ని క్రీడలు నిర్వహించడం. ఎక్కడా ఏ లోటు కన్పించకుండా ప్రశాంతంగా ఎనిమిది రోజులు అంత గొప్పగా అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడోత్సవాలను నిర్వహించటం అందరం గర్వించదగ్గ విషయమే మరి! ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని తొంభై ఐదు దేశాలు ఆ ఆగ్ క్రీడోత్సవాల్లో పాల్గొన్నాయట! భిన్న సంస్కృతులు, భిన్న వర్ణాలు, భిన్న కళలు జీవితాలు ప్రతిబింబించేటట్లుగా ముగింపు కార్యక్రమాన్ని చాలా బాగా నిర్వహించారు!" అన్నాన్నేనూ ఆనందంగా.

"అంతేకాదు ఆంటీ! ప్రపంచ ఒలింపిక్ ఆటల్లో చైనా, జపాన్ తర్వాత ఎక్కడో వున్న భారతదేశం ఈ ఆఫ్రో ఏషియన్ ఆటల్లో పతకాలు సాధించడంలో రెండో స్థానంలో వుంది! అది తలచుకుంటేనే ఒళ్ళు పులకరిస్తున్నది ఆంటీ!" అంది మాలిని అతి ఉత్సాహంగా. మాలినికి ఆటలంటే చాలా ఇష్టమని నాకు తెలుసు. అందుకే ఆమె తన సంతోషాన్ని నాతో పంచుకోవాలని వచ్చి వుంటుంది.

"మాలిని, ఇండియా రెండో స్థానంలో వున్నా ఎక్కువ రజతం, కాంస్య పతకాలతో మొత్తం ఎనభై పతకాలను గెల్చుకొని మొదటి స్థానంలో వుందనుకుంటాను. అవునా!" అడిగాన్నేను.

"అవును ఆంటీ! యూ ఆర్ కరెక్ట్! అన్ని పతకాలను గెలుచుకుంటామని నేనూహించనే లేదు. చైనా మొత్తం నలభై ఒక్క పతకాలనే గెలుచుకుంది. కాని ఇరవై ఐదు బంగారు పతకాలను సంపాదించుకుంది. మనమేమో కేవలం పందొమ్మిదే!" నిరాశగా అంది మాలిని.

"ఇంతవరకు ప్రపంచ స్థాయి ఒలింపిక్ ఆటల్లో మనకు హాకికి మాత్రం కొన్నాళ్ళు బంగారు పతకం తర్వాత ఒక బ్రాంజ్ పతకం సంపాదించటంతోనే ఆగిపోయాం. పాపం! మొట్టమొదటి సారి మిల్ఖాసింగ్ పరుగులో కాంస్యమైనా సంపాదిస్తాడనుకుంటే నాల్గో స్థానంలో వుండిపోయాడు. అట్లా పతకం దగ్గరగా వచ్చిన మొదటి ఆటగాడు మిల్ఖాసింగ్. తర్వాత పి.టి. ఉష కూడా కాస్తలో పతకం మిస్సయింది! సరే! ఈసారి ఈ ఆటలను చూస్తుంటే వచ్చే ఏడు ఏథెన్స్‌లో



జరగబోయే ఒలింపిక్ ఆటల్లో మనం కాస్తయినా మెరుగై ఒక స్థానాన్ని సంపాదించుకుంటామేమో చూడాలి. ఆ ఒలింపిక్ ఆటలకు ముందుగా ఈ ఆటలు జరగడంతో మన ఆటగాళ్ళ ఆత్మవిశ్వాసాన్ని పదును పెట్టినట్లయింది! అన్నాన్నేను ఆశావాదంతో. 'కాస్తయినా ఎందుకు ఆంటీ ఈసారి మనకు చాలా పతకాలు వస్తాయి!" అంది మాలిని ఆత్మవిశ్వాసంతో "ఏమో చూద్దాం! అయినా ఈ ఆటల్లో కొన్ని మంచి దేశాలతోనే పోటీపడ్డాం. పతకాలు సాధించాం! ఆటల్లో అన్ని ఆటల పోటీలు జరిపినట్లుగా లేదు... జిమ్నాస్టిక్ పోటీలు లేవు. ఆ పోటీలుంటే చైనా ఇంకా బంగారు పతకాలు సాధించి వుండేది. అయినా టెన్నిస్‌లో మనం ఆఫ్రికా ఏషియా ఖండాల్లో అందరికన్నా ముందున్నామని నిరూపించాం. కాని పాశ్చాత్య ఆటగాళ్ళ ముందు మనవాళ్ళకు ఇంకా బలం, శక్తి, వేగాలు తక్కువేనేమో అనిపిస్తుంది!" అన్నాన్నేను.

"అయ్యో! ఆంటీ మన హైదరాబాద్ సానియా మిర్జా టెన్నిస్‌లో ప్రపంచ పోటీలో మొదటిసారి గెల్చిన భారత యువతి అనిపించుకుంది. ఆగ్ ఆటల్లో నాలుగు బంగారు పతకాలు ఆమె ఒక్కతే సంపాదించింది!" ఎగిరి గంతేసినంత పని చేసింది మాలిని. ఆమె ఆనందానికి పట్టపగ్గాల్లేకుండా వున్నాయి.

"నువ్వన్నది నిజమే మాలిని! నేను ఉజ్బెకిస్తాన్‌తో మన యువతులు ఆడిన హాకీ ఆటను టీవీలో చూశాను. ఇట్ వజ్ సూపర్! అదే! మన వాళ్ళు ఆడిన ఆట! చాలా బాగుంది. అసలు బాల్ ఎప్పుడూ అదర్ హాఫ్‌లోనే వుండిపోయింది చాలా బాగా ఆడారు. హాకీలో మనకు రెండు బంగారు పతకాలు వచ్చాయి. ఫుట్‌బాల్‌లో మాత్రం ఆఖరి క్షణంలో అజాగ్రత్త వల్ల ఓ బంగారు పతకాన్ని వదులుకోవలసి వచ్చింది!" నా నిరాశ చూసి మాలిని ఏం నిరాశపడలేదు.

"అన్ని సౌకర్యాలు, సాధనలు లేక మన ఆటగాళ్ళు ఇట్లా వున్నారు కాని అన్ని విధాల వాళ్ళకు సాధన చేసే అవకాశాలుంటే ఇంకా తమ ప్రతిభ ప్రదర్శించి ముందుంటారు. "ఆంటీ! ఇప్పుడిప్పుడే వాళ్ళకు తగిన కోచ్‌లు ఆర్థిక సాయం సరైన వసతులు, ఆహారాలు దొరుకుతున్నాయి. అయితే దీన్నంతా మార్చకుండా వుండాలని ఆశిస్తున్నాను ఆంటీ!" అంది మాలిని గంభీరంగా.

"నువ్వన్నది నిజమే మాలినీ! ప్రతిదాన్ని రాజకీయం, అవినీతి మయం చేయడం మానుకోవాలి! అంతెందుకు మొన్న ఆరంభం, ముగింపు కార్యక్రమాల్లో మైక్ ముందు ఒక్కొక్కరు అంతేసి ఉపన్యాసాలెందుకు చెప్పు! మైక్ పట్టుకొని వదలడమే లేదు. అయినా అంతమంది ఎందుకు మాట్లాడ్డం. అంతమంది అవసరమా అక్కడ! సరే! కొందరైతే ఇదేదో ఎలక్షన్ల మీటింగు అన్న ధోరణిలో మాట్లాట్టం! చాలా బోర్ అయిందనుకో!" నా మాటలతో మాలిని ముఖం చిన్నబోయింది.

"నిజమే ఆంటీ! ఆ లెక్చర్లన్నీ లేకుండా వుంటే బాగుండేది!" ఒప్పుకుంది మాలిని.

"ఇంకోమాట! చాలామంది విద్యార్థులకు, యువతకు ఆటల ఆరంభం, ముగింపు కార్యక్రమాలు చూడాలనుకున్న వాళ్ళకు నిరాశ ఎదురైంది. సెక్యూరిటీ పేరుతో నిర్బంధాలు ఎక్కువయ్యో సరైన ఏర్పాట్లు లేకనో సామాన్య మానవుడు స్వేచ్ఛగా పోయి ఆ కార్యక్రమాలను చూసే అవకాశం కలగకపోవడం దురదృష్టకరమైందని చెప్పాలి. స్టేడియంలోకి ప్రవేశం కలగటం అంటే రాజకీయాలతో పైరవీలతో కూడిన పని అయితే ఎట్లా చెప్పు! అన్నాన్నేను నా ఆవేశాన్ని దాచుకోకుండా.

"ఆంటీ! ఇంకో విషయం... ఇప్పట్నుంచైనా ప్రతి స్కూలు, కాలేజీలో ఆట స్థలాలుండాలి. ఆటలకు ప్రోత్సాహం ఇవ్వాలి. బందెల దొడ్లో తోలినట్లుగా పిల్లల్ని స్కూళ్ళలో, కాలేజీల్లో బంధించేసి పుస్తకాలు తప్ప మరో ప్రపంచం లేదని నూరిపోసే నిర్బంధ సంస్కృతి నశించాలి!" అంది మాలిని ఆవేదనగా.

"నువ్వన్నది నిజమే మాలినీ! ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా తన అభిరుచికి తగినట్లుగా వృత్తిని ఎన్నుకునే రోజులు రావాలి! అప్పుడే వ్యక్తిత్వ వికాసం జరుగుతుంది!" అన్నాన్నేను.

"మన ఆటల స్ఫూర్తికిది నవోదయం! మన ఆటల ప్రతిభకిది నాంది ఆంటీ!" మాలిని ముఖం ఆనందంతో వెలిగిపోయింది. ●

వాతావరణ విశేషాలు

ఎంత వేసవి కాలమైనా - సదరు సీజను తాలూకు ఎండ - రోజంతా ఒకేలా వుండదు!

ఉదయం చిరు ఎండ చిటపట లాడుతుంది! మధ్యాహ్నం మండుటెండ మాడు పగల గొడుతుంది! సాయంత్రం చవట ఎండ చమత్కారిగా అవతారమెత్తుతుంది!

పూటపూటకి మారిపోతూ వుంటుంది-

మాయదారి ఎండ!

ఎండ తీవ్రతను బట్టి మనిషి మూడ్ కూడా మారుతుంది! మండుటెండలో నిలబెట్టి, జోకులేస్తాను నవ్వమంటే చెప్పుతో కొడుతారు! పరిస్థితి అల్లాంటిది!

ఆ వేళప్పుడు -

ఆ వాతావరణం జోకుల్ని పట్టించుకునేందుకు సూటుకాదు! వళ్ళుమండి పోతుండగా జోకుల్ని విని నవ్వేంత ఓపిక ఎవరికుంటుంది. జోకులు వినడమే కాదు - చెప్పేందుక్కూడా ఎండ పర్మిట్ చేయదుగాక చెయ్యదు!

ఎండ నిప్పుల్ని చెరుగుతున్నప్పుడు మనసు ఏ.సి.గది మీదికి మళ్ళుతుందేగాని - ముష్టి జోకులు ముచ్చటగా విందామని కోరుకోదు. జోకులు వినడానికే అవకాశం లేనప్పుడు డ్యూయెట్లు పాడుకుందామని ఇండెంటు పెడితే - అది పరమ పాపిష్టి కోరికకు పరాకాష్టవుతుంది!

వాతావరణం చల్లబడిన తర్వాత - పిల్లగాలులూ మలయమారుతాలూ వగైరా ఏర్పాట్ల మధ్య - మీరేం చెప్పినా అవతల వ్యక్తి శ్రద్ధగా వింటాడు. సెభాషనక పోయినా ఛీ కొట్టడు. ఆ పాటి గ్యారంటీకి ఢోకా వుండదు!

సినీమా షూటింగుల్లో ఈ సూత్రం పని చేయదు. సినీమా వాళ్ళు ఎండని అపారంగా గౌరవిస్తారు. గాఢంగా ప్రేమిస్తారు. పిల్లగాలులూ మలయ మారుతాలూ లేకపోయినా సరిపెట్టుకుంటారు. ఒక్క ఎండ వుంటే చాలంటారు. నిప్పుకక్కే సూర్యుడ్ని డోంట్‌కేరంటారు. కెమేరా వనితనంతో నూరీడ్ని చందమామగా చూపెడతారు. పగల్ని రాత్రి చేస్తారు. ఎండని వెన్నెలగా వెలిగిస్తారు. ఆ మాయ వెన్నెల్లో హీరోహీరోయిన్ల చేత - "ఎంత హాయి ఈ రేయి" అని పాడిస్తారు! ఈ మొత్తం భాగోతం తెరమీద చూచి ఆహా ఓహో అనుకుంటాం. అంతే తప్ప - సదరు హీరోహీరోయిన్లు ఆ పాట షూట్ చేసే సమయంలో - మండుటెండలో - ఎంత చిరాకు వడ్డారు... ఎంతమాడి మసై పోయేరో ఊహించలేం! ఎండలో గంతులేస్తూ అహా వెన్నెల ఓహో వెన్నెలంటూ సంబరపడిపోయేది సినీమా వాళ్ళు మాత్రమే.

ఇంత తెలిసీ మగమారాజు స్పీడుగా పప్పులో కాలు వేస్తుంటాడు. సినీమాల్లో ఎండని వెన్నెలగా మార్చవచ్చేమోగానీ - జీవితంలో ఆ ఏర్పాటుకి ఛాన్సు లేదు! వుండదు. బాసు కేంప్‌కి వెళ్ళిన కారణంగా - అతను మిట్టమధ్యాన్నం ఇల్లు చేరుకుంటాడు. రెండు మెతుకులు కతికి ఫేను కింద విశ్రమిస్తే సుఖానికి సరైన నిర్వచనం అదేనని మొదట అనుకుంటాడు. ఆ ఏర్పాటు జరిగేక - కోరిక శృతి మించుతుంది! కొంచెం శృంగారం చేసుకుంటేనే గాని సుఖం లేదనుకునేంత లెవెల్లో ఎదుగుతుంది! కిందామీదా చూడడు. పూర్వాపరాలు ఆలోచించడు. అప్పటికే ఇంటెడు చాకిరీతో రెక్కలు ముక్కలు చేసుకున్న ఇల్లాలి చెంగు పట్టుకుంటాడు. కాదంటే ఖస్సుమంటాడు. నా మెడకి గుదిబండవని దెప్పి పొడుస్తాడు!

మగాడు చెడి పోతున్నందుకు అసలైన కారణం ఆ ఇంటి ఇల్లాలే అని సూత్రం చెప్పి - తద్వారా తాను సైతం రాంగ్ లైన్లో పడిపోయే ప్రమాదముందని హెచ్చరించి భయపెడతాడు. ఆ మాటలలో ఇంటి ఇల్లాలు తల్లడిల్లిపోతుంది! మూడూ ముచ్చట అవతల పెడుతుంది. భర్తని దారి తప్పనియ్యకు స్వామీ అని దేవుడ్ని ప్రార్థించి పతిదేవుడి ఆజ్ఞను శిరసా వహిస్తుంది. తద్వారా మండుటెండలో నిలబడి చవక జోకులు వినే పరిస్థితికి పడిపోతుంది. ఈ చరిత్రకి రెండో వేపు కూడా వుంది!

అది వెన్నెల రాత్రి. వండువెన్నెల విందారపోసినట్టు వెలుగుతున్న వేళ. సిగలో సన్నజాజులూ... గదిలో సుగంధ పరిమళాలూ - వెరశి మదిలో చిన్న పులకింతకు దారి తీసినప్పుడు ఆమె పతి దేవుడి వంటి మీద చెయ్యి వేస్తుంది. అంతకుమించి సాహసం ఆ అతివ చేయలేదు. అందుకు రూలు ఒప్పుకోదు. మనసూ అంగీకరించదు. ఆ చేతి స్పర్శకే అతడు ఉలికిపడతాడు. సాయంత్రం అనవసరంగా ఆటీను రాణిని వేస్తు కార్డుగా భావించి పక్కవాడికి విసిరినందుకు - ఆ కార్డు పుణ్యమాని పక్కవాడు బతికేడు. బతకడమే కాకుండా ఆటకూడా తిప్పేడు. ఈ చిన్న చిరాకు ఆ మహాశయుడి బుర్రలో పెద్ద పీట వేసుక్కూచుంది. ఆటీను రాణి చేసిన అన్యాయానికి అతని గుండెలు మండిపోతుంటే మనసు శృంగారం వేపు ఎందుకు దూకుతుంది. రూలొప్పుకోదంటాడు. అప్పుడు కూడా ఆమె అవును కాబోలనుకుని తన సాహసానికి సిగ్గుపడుతుంది. పతిదేవుడ్ని ఇక ముందు అన్యాయం చేయవద్దని ఆటీను రాణిని ప్రార్థించి నిద్రకు స్వాగతం పలుకుతుంది. సర్వవేళలా గెలుపు నాదేనన్న మగమనస్తత్వానికి తెరపడేదెప్పుడో? ●

వెలుగుబాణం - చీకటి కోణం

గ్రామంలో మూడ్రోజుల్నుండీ బజాయించి మరీ చాటింపు వేసినారు గదా...! ముసలీ, ముతకా - ఆడా, మగా - పిల్లాపీచూ మొత్తానికి మొత్తం గ్రామ చావిడిలో జమైపోయారు.

"మన రాష్ట్రంలో దరిద్రుల జనాభా నలభైఎనిమిది శాతం - అంటే నూటికి సగం మంది దారిద్ర్యరేఖకు దిగువనే వున్నారని మన సర్వేలో తేలింది. ఈ దరిద్రాన్ని రూపుమాపడానికి మన ముఖ్యమంత్రి చెంద్రబాబుగారు సంధించినదే ఈ వెలుగుబాణం! దీంతో దరిద్రం పరారు కావాల్సిందే.

వెలుగు ఆఫీసరు గారు దంచిపారేస్తున్నారు - అసలు 'దరిద్రం' అంటే ఎట్లా వుంటుందో ఆ గ్రామ 'దరిద్రుల'కే సరిగా తెలవదు. ఎందుకంటే ఈ అయిదారేండ్ల కాలంలో కిందా మీదా లేకుండా అందరూ సమానంగా దరిద్రులైపోయినారు. అంతా తికమకగా వుంది... అయోమయంగా... గందరగోళంగా వుంది. అంతా దరిద్రమే అయినపుడు మళ్ళా 'సర్వే' అంటాడేంది ? అంటే ఈ ఊర్లో సగంమందే దరిద్రులా...? అదెట్లా అట్లా వుండడానికి వీల్లేదే?" ఇట్లాంటివి జనంలో సవాలక్ష అనుమానాలు వచ్చి పడినై!

"యహె సోది అంతా ఎందుగ్గానీ... ముందు మీరు నికరంగా తేల్చి పారేసిన ఆ దరిద్రులెవరో బయటపెట్టండి! జక్కులోడు చిన్నపాటి హుంకారం చేసి తొడచరిచి మరీ అరిచాడు.

"సోమయ్య తండ్రి పేరు రామయ్య!"

"అంటే మన మాజీ యమ్మెల్యే పచ్చబాబుగారి బామ్మర్ది సోమయ్యగారేనా... పెద్ద దరిద్రుడు... వార్నీ... వారు దరిద్రం గీతకు బాగా కింద వుండిపోయినారన్నమాట... జనం కలివిడిగా... హాహాకారాలు చేశారు. బందోబస్తుకు వచ్చిన పోలీసులు లాఠీలు ఝులిపించి... అదిలించి అరవకుండా కట్టడి చేశారు.

"వామ్మ... వామ్మో... మా సోమయ్యబాబు దరిద్రుడంటే మేం చచ్చినా ఒప్పుకోం... మారాజు... ఆయనకేందండీ... సల్లంగుండాల... ఇదుగో ఆఫీసరు.. మా సోయ్య దొరను పట్టుకుని 'దరిద్రుడు' అనిగాని అంటే మర్యాద దక్కదు.. మల్లేశు మటమటలాడి పోయాడు. ఆఫీసరు బిక్కచచ్చి దిక్కులు చూశాడు.

"అరె... పూర్కోండ్రా... నేను 'దరిద్రుడి' కిందే లెక్క.. అయినా నాకు లేని 'అభిమానం' మీకెందుకురా... కానీవయ్యా ఆఫీసరూ..." సోమయ్య బల్లగుద్ది మరీ జనంలోకి సవాలు విసరడంతో జనాలు దిమ్మెరపోయారు.

"ఎట్లా... దరిద్రుడంటే ఏమీ లేనోడనే గదా అర్థం... అయ్యో... మీకేం లేకపోటం ఏందీ... అన్నీ వున్నాయిగా!" జక్కులోడు బహు అమాయకంగా అడిగాడు.

"ఏమున్నాయిరా నాకు... మీపాటి కూడా చేయను!" సోమయ్య తాపీగా సమాధానం చెప్పాడు.

"వామ్మో... వామ్మో... మీకు పొక్లేను మిషను గూడా వుందె!" గుండెలు బాదుకున్నాడు మల్లేశు.

"ఓస్నీ.. అదిపుడు యాడుందిర! ఆడికెవడికో కంట్రాక్టు పనికి కావాల్నంటే పంపించిన్నాయె.. కావాల్నంటే వచ్చి చూస్కో!" సోమయ్య నింపాదిగానే సిగరెట్ ముట్టించాడు. జక్కులోడు అవాక్కయ్యాడు.

"మరి మీరెండంతస్తుల మేడా... తోగిలీ..

వార్నీ.. గవర్నమెంటూ... అటు ఆ గ్రామీణ బ్యాంకూ వాండ్లు అడిగితే అద్దెలకు ఇచ్చేస్తిని... అటు ఆ గోదవారిన తాటాకులు పందిర కింద.. కాదుర మొత్తానికి మొత్తం మకాం పెట్టిందీ! అయ్యా ఆఫీసరూ... అదీ నా పరిస్థితి!"

"నిజమే.. నిజమే.. వుంటానికి 'ఇల్లు' కూడా లేనివాడు 'దరిద్రుడు' గాక మరేం అవుతాడు. నిజవే! ఆఫీసరు చెమట్లు కారుస్తూ సంతోషంగా సర్దుకున్నాడు. జక్కులోడి ఒళ్ళు మండిపోయింది.

"అదేంది.. కొడుకులిద్దరు పెద్ద చదువులు... అమ్మో.. మీరు దరిద్రులెట్ల అయిపోతారు తండ్రో...!"

"చదువుతున్నారు... ఎక్కడ ఒకడు అమెరికాలో.. ఒకడు మరి ఇంగ్లాండులో వాళ్ళ మిదుకుల్లేవో వాండ్లు మిదుకుతున్నారు. వాళ్ళుండి కూడా లేని ఒంటరి పక్షిని... అభాగ్యుడ్ని"

జనం చాలా సేపు హాహాకారాలు చేసి మరింత ఓపిక లేక వుస్సురని వుండిపోయారు. ఈలోపున గోవిందుగాడు చిరుగుల గోచీ సర్దుకుని పెద్దగా అరిచాడు. "ఆయనగారి సంగతి పోనివ్వండి... ఇంతకూ నా పేరు లిస్టులో వుందా? నా పేరు గోవిందం... మా అయ్యపేరు ఆనందం...!" అని గట్టిగా అరిచాడు. జనాలు వూపిర్లు బిగబట్టి చెవులప్పగించి చూస్తుండిపోయారు. ఆఫీసరు కాగితాలు అటుఇటు తిప్పి పెదవి మూడుసార్లు వంకరటింకరగా విరిచాడు.

"అబ్బేలేదు! గోవిందం సన్నాఫ్ ఆనందం.. దరిద్రుల జాబితాలో నీ పేర్లేదు!" "ఎందుకులేదు - నీకేముంది?" కీసరబాసరగా అరిచాడు గోవిందం. వెలుగు అధికారి కాగితాలను ఎడాపెడా... కిందా మీదా పరిశీలించి కేకలాంటిది పెట్టాడు" నీ భార్య డ్వాక్రా... నీకు గ్యాసుబండుంది. నీవు దరిద్రుడివి కావు... కాదు..." అని చేతులాడిస్తూ వెల్లడించాడు. "ఓర్నీ... దాన్నింతవరకు వెలిగించకపోతిని. దానిమీద చెట్టబొచ్చెలు తప్ప నూకలు కూడా దొరకవాయె...."

దాంతో జనవంతా కీసరబాసరగా తగులుకున్నారు. వెలుగు అధికారి బహు నెమ్మదస్తుడూ... మొండివాడు కావడం చేతనూ... తిరకాసు జవాబులు శాంతంగానే చెబుతున్నాడు. వెంకులుగాడు ప్లాస్టికు గడియారం... నెంబర్లది కొనుక్కున్నందుగ్గానూ... నారిగాడు కురివి అంగట్లో కొత్త చెప్పులు కొనుక్కునందుకు గానూ... వాళ్ళందరి పేర్లూ 'వెలుగు'లో దరిద్రరేఖకు పైభాగాన వున్నట్లుగా, సర్కారు తేల్చిపారేశారు. ఇంకా వూర్లో చాలా మంది 'పేదముండాకొడుకు'ల్నంతా ఒక్కసారే 'కలవారి' కింద చేర్చిపారేయడంతో 'వెలుగు' సభలో పెద్ద కలకలం చెలరేగిపోయింది గానీ... హరిజనవాడలో 'బీలెగట్టు' దాడి ఉదంతం మాత్రం వీటన్నిటికన్నా వేరుగా రసవత్తరంగా వుండడంతో జనం యధావిధిగా రెచ్చి - అల్లరికి దిగిపోక తప్పలేదు - అదెట్లనిన-

"నీకేం లేదు... ఏంలేదంటే లేదు... ఈ మొండి రెక్కలు తప్ప... అయినా మరి నా పేరు లిస్టులో ఎందుకు లేదో ఒక్కసారి చెప్పండెసె!" అని వాడు దిసమొలతోనే మొండికేశాడు. అధికారి ఈసారి కాస్తంత తికమకపడ్డాడు.

"నీ పేరు... అసలు నీ పేరు.. బిల్‌గేట్స్... గేట్సు గదా... నువ్వెట్ల దరిద్రుడివి.. ఆఁ...!" అని దమాయింపుకు తగులుకోవడంతో అందరూ విభ్రాంతులైపోయారు. వాడిపేరును బిల్‌గేట్స్‌గా ఎక్కించి పారేశారు. మరి ఆయనగారు దరిద్రరేఖకు చాలా పైనే కోటీశ్వరుడాయె! జనం ఇక లాభం లేదనుకుని అధికారిని కదలకుండా దిగ్బంధనం చేసి... పెద్ద గదోలకు తగులుకున్నారు.

"అసలు దరిద్రుల పేర్లు లిస్టులకెక్కలేదు... ఎక్కిస్తేనే గానీ కదలడానికి లేదు!" అని పెడబొబ్బలు పెట్టడంతో అధికారి అప్పటికి అందరి పేర్లెక్కించడానికి ఒప్పుకున్నాడు.

బాగానే వుంది!

"ఒరె జక్కులోడా... అసలు మతలబు అర్థమైందిర!" యాద్గిరి బీడి వెలిగించాడు.

"మతలబేందే!" జక్కులోడు నోరు తెరిచి అడిగాడు.

"దరిద్రం పూరాగా పోవడానికి ఆ లిస్టులో పేరు ఎక్కాలె.. అదే సాలు! అనుకుంటున్నారు - అమాయకులు... దాంతో ఈ దరిద్రం యాడికీ పోనే పోదని వాండ్లకు తెలవకపాయె!"

"ఆఁఆఁ" జక్కులోడికి మూర్ఛవచ్చినంత పనయింది!



ప్రజారోగ్య సమస్యగా డెంగ్యూ



డెంగ్యూ వ్యాధి ప్రపంచ వ్యాప్త ప్రజారోగ్య సమస్యగా పరిణమించింది. మానవులలో తీవ్ర అనారోగ్యానికి, మరణాలకు కారణమవుతున్నది. ప్రపంచంలో 250 కోట్ల మంది ప్రజలు డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలున్న ప్రదేశాలలో నివశిస్తున్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. యూరప్‌లో తప్ప అన్ని ఖండాలలోనూ డెంగ్యూ ప్రతి ఏటా వ్యాప్తి చెందుతూనే ఉంది. 1995లో లాటిన్ అమెరికాలో విజృంభించింది. రెండు లక్షల మంది వ్యాధికి గురికాగా అందులో ఆరు వేలమంది డెంగ్యూ హెమరేజిక్ ఫీవర్‌కు గురయ్యారు.

భారతదేశంలో 1812లోనే డెంగ్యూ ఉనికిని గుర్తించినట్లు చరిత్ర పుటలు తిరగేస్తే తెలుస్తుంది. 1952లో దేశంలోని కొన్ని ప్రాంతాలలో రక్త పరీక్షలకు సంబంధించిన 'సీరోలోజికల్ సర్వే' జరిగింది. ఈ సర్వేలో డెంగ్యూ వైరస్ ఉనికిని దేశంలో చాలా ప్రాంతాలలో గుర్తించారు. 1960లో డెంగ్యూ వ్యాధికారక వైరస్‌ను వ్యాధిగ్రస్థుల నుంచి 'ఐసోలేట్' చేశారు. 1963 జులైలోనూ,1964 మార్చిలోనూ కొల్‌కతాలో డెంగ్యూ హెమరేజిక్ ఫీవర్ విజృంభించింది. 1982లో ఢిల్లీలో ఈ వ్యాధి దర్శనమిచ్చింది. 1996 అక్టోబర్‌లో మళ్ళీ డెంగ్యూ విజృంభించింది. అప్పుడు ప్రభుత్వానికి అందిన గణాంక వివరాల ప్రకారం 7,247 మందిలో డెంగ్యూ వ్యాధిని గుర్తించగా, వారిలో 297 మంది మృత్యువాత పడ్డారు. 1996లోనే దేశవ్యాప్తంగా వ్యాధి విజృంభణ పట్ల కలకలం మొదలయింది. మన రాష్ట్రంలో కూడా కొంత మందికి డెంగ్యూ సోకినట్లు వెల్లడయింది.ప్రభుత్వం ప్రచార, ప్రసార సాధనాలలో ప్రకటనలు ఇచ్చి, కరపత్రాలు ముద్రించి ప్రచారం నిర్వహించింది. మన దేశంతోపాటు బర్మా, బంగ్లాదేశ్, శ్రీలంక, థాయిలాండ్, మలేషియా, సింగపూర్, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్ దేశాలలో కూడా డెంగ్యూ ఎక్కువగా వ్యాప్తి చెందుతోంది. ప్రస్తుతం మన రాష్ట్రాన్ని ఈ వ్యాధి వణికిస్తోంది.

డెంగ్యూ వ్యాధికి కారణమేమిటి?

డెంగ్యూ వ్యాధికి 'వైరస్' కారణమవుతుంది. ఈ వైరస్‌ను వైరస్‌ల వర్గీకరణలో 'ఆర్బోవైరస్'లలో చేర్చారు. ఆర్బోవైరస్‌లు దోమల వంటి ఆర్థోపాడ్స్ ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతాయి. డెంగ్యూ వైరస్ వ్యాప్తిలో ఏడిస్ జాతికి చెందిన ఈజిప్టై, ఆల్బోపిక్టస్ దోమలు కీలకమైనవిగా వైద్య శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడయింది.

వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుంది?

సాధారణంగా వర్షాలు పడుతున్నప్పుడు వ్యాధి విజృంభిస్తోంది. దోమల వ్యాప్తికి అనుకూల వసతులు ఏర్పడటం, డెంగ్యూ వైరస్ సంఖ్యాభివృద్ధికి అనువైన పరిస్థితులు.. అంటే గాలిలో తేమ శాతం పెరగడం, వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గిపోవడం వంటివి ప్రధాన కారణాలని ప్రత్యేకించి ప్రస్తావించనక్కరలేదు. మనుషులు 'డెంగ్యూ' వైరస్‌కు 'రిజర్వాయర్లు'గా వ్యవహరిస్తున్నారు. మనుషుల నుంచి దోమలకు, దోమల నుంచి మనుషులకు.. మళ్ళీ మనుషుల నుంచి దోమలకు.. వైరస్ వ్యాప్తి చెందుతూ ఉంటుంది. దేశంలో అప్పుడప్పుడు డెంగ్యూ విజృంభించడానికి కొన్ని ప్రత్యేక కారణాలను వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. నగరాలు, పట్టణాలలో జనావాసం పెరిగిపోవడం, నివాస, పరిసరాలలో పరిశుభ్రత లోపించడం, శానిటేషన్ సదుపాయాలు సరిగ్గా లేకపోవడం, ఇరుకైన నివాస ప్రాంతాలలో.. జనసాంద్రత పెరిగిపోవడం వంటివి వాటిలో

డెంగ్యూ వ్యాధి బాధితుడు

డాక్టర్ జి.ఎస్.కె.శేఖర్,
జనవిజ్ఞాన వేదిక, సబ్‌కమిటీ మెంబర్, హైదరాబాద్

◆ డాక్టర్‌గారూ నేను ఉదయం లేవగానే 5 కి.మీ. వాకింగ్ చేస్తాను. కాని నాకు మోకాళ్ళ నొప్పులు వస్తున్నాయి. ఒక కి.మీ. తరువాత కుడిపక్కలో నొప్పి వస్తుంది. మొత్తం బాడీ అంతా నొప్పిగా ఉంటుంది. దీనికి పరిష్కార మార్గం తెలుపగలరని మనవి.

– ఎ.సాంబయ్య, హన్మకొండ

మూత్రం అసంపూర్తిగా, మాటి మాటికీ రావడానికి కారణం, మూత్రపిండాలు, మూత్రనాళం లేదా మూత్రాశయంలో రాళ్ళు ఉండడం, వాటిమూలంగా ఇన్‌ఫెక్షన్ రావడం వల్ల కావచ్చు. మీ సరైన డాక్టర్‌ని సంప్రదించి CUE, Urine C/S, KUB, U/S మొదలగు పరీక్షలు చేయించుకొని తగిన మందులు రెండు వారాల వరకు వాడి, మరల ఇన్‌ఫెక్షన్ తగ్గిందో లేదో CUE పరీక్ష ద్వారా నిర్ధారించుకోవాలి. అలాగే రాళ్ళు వుంటే, మాటిమాటికి ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, శస్త్ర చికిత్స ద్వారా తొలగించాలి. రాళ్ళు చిన్నవి అయితే క్రమేణా నీరు ఎక్కువగా తాగడం వల్ల మూత్రంలో పోయే అవకాశం ఉంది.

సరైన మందులు, సరైన మోతాదులో, తగినంత కాలం వాడక పోవడం వల్ల కూడా ఇన్‌ఫెక్షన్ తిరగబెట్ట వచ్చు. మీ సమస్యకు ఇతర కారణాలు కూడా ఏమన్నా వున్నాయేమో నిర్ధారించుకోవాలి.

పేర్కొనదగినవి.

ఇంక్యుబేషన్ పీరియడ్ ఎంత ఉంటుంది?

శరీరంలో వ్యాధి కారక సూక్ష్మజీవులు ప్రవేశించినప్పటి నుండి.. వ్యాధి లక్షణాలు బయటపడేందుకు పట్టే కాలాన్ని 'ఇంక్యుబేషన్ పీరియడ్' అంటారు. డెంగ్యూ ఫీవర్ విషయంలో ఈ ఇంక్యుబేషన్ పీరియడ్ 3-10 రోజుల వరకు ఉంటుంది. సాధారణంగా 5-6 రోజుల్లో ఎక్కువ మందిలో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. శరీరంలో వైరస్ ప్రవేశించిన వారందరిలోనూ వ్యాధి లక్షణాలు బయటపడవు. వీరు ఎసిప్టమాటిక్‌గానే ఉంటారు. దేహంలోని సహజసిద్ధ రోగ నిరోధక వ్యవస్థే వ్యాధిని నిరోధిస్తుంది. అందుకనే 'డెంగ్యూ'ను సెల్ఫ్ లిమిటింగ్ వ్యాధిగా పేర్కొంటారు. కొద్దిమందిలో మాత్రమే డెంగ్యూ ఫీవర్ లక్షణాలు బయటపడతాయి. సింప్టమాటిక్‌గా మారతారు. ఎంత శాతం మందిలో వ్యాధి లక్షణాలు బయట పడతాయన్నది చెప్పడానికి సరైన గణాంక వివరాలు లభ్యం కాలేదు. డెంగ్యూ వ్యాధికి వయస్సు, స్త్రీ, పురుషులన్న దానితో సంబంధంలేదు. ఏ వయస్సు వారికైనా స్త్రీలు, పురుషులు ఎవరిలోనైనా వ్యాప్తి చెంద వచ్చును. అయితే పిల్లల్లో ఎక్కువగా వస్తున్నది. డెంగ్యూ లక్షణాలు బయట పడ్డ వారిలో కూడా వ్యాధి రెండు రకాలుగా ఉంటుంది. వాటిలో మొదటిది డెంగ్యూ ఫీవర్ కాగా రెండవది డెంగ్యూ హెమరేజిక్ ఫీవర్.

డెంగ్యూ ఫీవర్

దీనినే సాధారణ డెంగ్యూ ఫీవర్ అని, క్లాసికల్ డెంగ్యూ ఫీవర్ అని కూడా పేర్కొంటున్నారు. విపరీతమైన ఒళ్ళు నొప్పులు దీని ప్రత్యేకత. అందుకే దీనిని 'బ్రేక్ బోన్ ఫీవర్' అని కూడా పిలుస్తారు. అధిక జ్వరం ఉంటుంది. వణుకు వస్తుంది. తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పి, కీళ్ళ నొప్పులు ఉంటాయి. కంటిలో కూడా నొప్పి ఉంటుంది. కాంతిని చూడలేరు. నీరసం, నిస్సత్తువకు గురి అవుతారు. ఆకలి నశిస్తుంది. మలబద్ధకం ఉంటుంది. నాలుకకు రుచి తెలియదు. కొందరిలో శరీరంపై రాష్ వస్తుంది. దురదగా ఉంటుంది. ఈ లక్షణాలు వారం రోజుల వరకు ఉంటాయి. ఇంతకు ముందే ప్రస్తావించినట్లుగా ఇది సెల్ఫ్ లిమిటింగ్ వ్యాధి. దానంతట అదే తగ్గిపోతుంది. క్లాసికల్ డెంగ్యూ ఫీవర్‌నే 'డెంగ్యూ ఫీవర్ సిండ్రోమ్' అని కూడా అంటారు.

డెంగ్యూ హెమరేజిక్ ఫీవర్

డెంగ్యూ ఫీవర్‌లో ఇదొక ప్రమాదకర దశ. దీని వల్లనే మరణాలు సంభవిస్తున్నాయి. శరీరంలో రక్తస్రావం ప్రారంభమవుతుంది. చర్మంపై రక్త స్రావపు మచ్చలు ఏర్పడతాయి. చిగుళ్ళు, ముక్కు వెంట రక్తం కారవచ్చును. గొంతు నొప్పి, ఉదరభాగంలో నొప్పి అనిపిస్తుంది. నోటి వెంట రక్తం పడవచ్చును. దీనినే 'హిమటెమిసిస్' అంటారు. రక్తస్రావం వల్ల విరేచనం నల్లగా అవుతుంది. దీనినే మెలీనా అంటారు.

లివర్ పరిమాణంలో పెద్దది అవుతుంది. చర్మం చల్లబడిపోతుంది. చివరకు రక్తస్రావం అధికమయితే.. శరీరంలో రక్త పరిమాణం తగ్గిపోతుంది. ఫలితంగా శరీరంలో ఫ్లూయిడ్ శాతం పడిపోతుంది. నాడి వేగం తగ్గుతుంది. గుండె వేగం పెరుగుతుంది. రక్తపోటు తగ్గిపోతుంది. చివరకు షాక్‌కు దారి తీస్తుంది. ఫ్లూయిడ్ కోల్పోవడం వల్ల సంభవించే ఈ షాక్‌నే 'హైపోవలీమిక్ షాక్' అంటారు. డెంగ్యూ హెమరేజిక్ ఫీవర్లో సంభవించే ఈ షాక్‌ను 'డెంగ్యూ షాక్ సిండ్రోమ్'గా పేర్కొంటారు.

డెంగ్యూను ఎలా నిర్ధారిస్తారు?

డెంగ్యూ వైరస్ ఉనికిని గుర్తించడం ద్వారానే వ్యాధిని నిర్ధారిస్తారు. వైరస్ ఉనికిని మూడు రకాలుగా గుర్తించ వచ్చును. శరీరంలో వైరస్ ప్రవేశించడం వల్ల వైరస్‌కు వ్యతిరేకంగా రూపొందిన యాంటీబాడీలను గుర్తించడం ద్వారాను, వైరస్‌ను సంఖ్యాభివృద్ధి చేసి పాలీమెరేజ్ చైన్ రియాక్షన్ ద్వారాను, వైరస్‌ను ప్రత్యక్షంగా ఐసోలేట్ చేయడం ద్వారాను డెంగ్యూ వ్యాధిని నిర్ధారించ వచ్చును. ఎలీసీ, ఇమ్యునోక్రొమాటోగ్రాఫిక్ పరీక్షలు కూడా ఉపయోగపడతాయి. ఈ పరీక్ష సదుపాయాలన్నీ అన్ని చోట్ల లభ్యం కావు. చాలా తక్కువ చోట్ల మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం సాధారణ రక్త పరీక్షల విషయానికి వస్తే.. రక్తంలో ప్లేట్‌లెట్‌ల సంఖ్య బాగా తగ్గిపోతుంది. దీనినే వైద్య శాస్త్ర పరిభాషలో 'త్రాంబో సైటోపీనియా' అంటారు.

చికిత్స ఏమిటి?

డెంగ్యూ వ్యాధికి ప్రత్యేక చికిత్స ఏమీ లేదు. అంటే వైరస్‌ను హతమార్చే మందులు ఏమీ లేవు. వ్యాధి లక్షణాలకు సపోర్టివ్, ఉపశమన చికిత్స మాత్రమే ఉంది. రోగికి పూర్తి విశ్రాంతి ఇవ్వాలి. ఫీవర్ అధిక స్థాయికి వెళుతుంటే.. తగ్గించేందుకు స్పాంజింగ్ చేయాలి. (శరీరాన్ని చల్లని తడిగుడ్డతో గాని, స్పాంజితోగాని తుడవడాన్నే స్పాంజింగ్ అంటారు.) అధికంగా ఓరల్ ఫ్లూయిడ్స్ ఇవ్వాలి. అవసరమైతే ఐ.వి. ఫ్లూయిడ్స్ పెట్టాలి. శరీరంలో సోడియం, పొటాషియం వంటి ఎలక్ట్రొలైట్స్ బాలెన్స్ తప్పకుండా చూడాలి. ఆమ్ల-క్షార సమతుల్యత ఉండేలా చూడాలి. మూత్రపిండాలు ఫెయిల్యూర్‌కు గురి కాకుండా అవసరమైన ఫ్లూయిడ్స్ ఇస్తూ ఉండాలి. నొప్పులకు ఆస్ప్రిన్ వంటి మందులు వాడకూడదు. అధిక రక్తస్రావం అవుతుంటే రక్త మార్పిడి అవసరమవుతుంది. సకాలంలో సరైన చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి రోగుల్ని రక్షించవచ్చును.

వ్యాధి నిరోధక జాగ్రత్తలు ఏమిటి?

దోమల వృద్ధిని నిరోధించాలి. డెంగ్యూ వైరస్‌కు వాహకాలుగా వ్యవహరిస్తున్న ఏడిస్ దోమలు మంచినీటిలో వృద్ధి చెందుతాయి. వీటి నిరోధానికి ఇంటి పరిసరాలలో కొబ్బరి చిప్పలు, టైర్లు, సీసాలు, డబ్బాలు, కుండలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

వాటర్ ట్యాంకులను అప్పుడప్పుడు శుభ్రపరుస్తూ నీరు పూర్తిగా మారుస్తూ ఉండాలి. ఇంకా దోమకాటు నుంచి రక్షించుకోవడానికి దోమతెరలు వాడాలి. డెంగ్యూ వ్యాధి అని అనుమానం వస్తే.. వైద్యులను సంప్రదించి పర్యవేక్షణలో ఉండాలి. ప్రజలు, ప్రభుత్వం సంయుక్తంగా ఏకకాలంలో స్పందించి దోమలపై యుద్ధం ప్రకటించాలి. విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు వ్యాధి పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాలు చేపట్టాలి. ప్రచార, ప్రసార సాధనాలు ప్రజల్ని భయపెట్టకుండా విజ్ఞానవంతుల్ని చేయాలి.

(హెల్త్ హెల్ప్ సౌజన్యంతో)

హాస్యానికి ప్రాణం పోసిన శ్రీరమణ

హాస్యం అంటే వెకిలి హాస్యంగా, ద్వంద్వార్థ సంభాషణలతో కూడుకొని పోయి, హాస్యం అంటేనే విరక్తి కలుగుతున్న ఈ రోజుల్లో 'హాస్యజ్యోతి' పేరిట శ్రీరమణగారు ప్రముఖుల హాస్యోక్తులను ఎంతో సున్నితంగా అందించటం చాలా గొప్ప విషయం. ఒక్కొక్క హాస్యోక్తిని చదువుతుంటే తెలుగు భాషలో ఇంత లోతులు వున్నాయా, ఇన్ని రకాల అర్థాలు వున్నాయా అన్న అనుభూతి కలుగక మానదు. పైగా ఈ పుస్తకం ద్వారా తెలుగు వారికి చాలా మంది ప్రముఖులను కూడా పరిచయం చేయటం జరిగింది. ఈ పుస్తకానికి గల అదనపు ఆకర్షణ బాపుగారి బొమ్మలే.

కొన్ని హాస్య సంభాషణలను తీసుకొంటే కట్టమంచి రామలింగారెడ్డి గారు విద్యాశాఖాధికారిగా పని చేస్తున్న రోజుల్లో ఓసారి. హైస్కూలును సందర్శించారు. రెడ్డిగారు తనిఖీ చేస్తున్న క్లాసులో తెలుగు మాస్టారు 'చీకటి' అనే పదాన్ని బోర్డు మీద రాసి చూపమని ఓ విద్యార్థిని అడిగారు. ఆ విద్యార్థి రాశాడు. "అరసున్నా వుండాలని తెలియదూ?" అని గద్దించారు ఆ విద్యార్థిని మాస్టారు. "అసలే చీకటి కదా! ఇక దానిలో అరసున్నా వున్నా కనిపించదులెండి" అన్నారు రెడ్డిగారు. తెలుగు మాస్టారికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. చీకటి అనే పదానికి చివర అరసున్నా వుంటుంది అనే విషయం చాలా మందికి తెలియకపోవచ్చు.

ఇకపోతే కన్నడ, తమిళ భాషల్లోని సినిమాలను తెలుగులో డబ్ చేసి ఆర్థికంగా దెబ్బతిన్న ఓ నిర్మాతకు మంచి తెలుగు కథను సరాసరి తెరకు ఎక్కించాలన్న ఆలోచన కలిగి విశ్వనాథ వారిని కలిసి విషయం వివరించి 'వేయిపడగలు' పారితోషికం సంగతి ప్రస్తావించారు. దానికి విశ్వనాథ వారు ఇరవైవేలు ఇవ్వండి అన్నారు. అసలే దెబ్బతిని వున్న నిర్మాత ధర విని అదిరిపడి 20 వేలతో వేయి పడగలు కొని నేనేం చేసుకుంటాను? 2000 ఇచ్చుకుంటాను ఓ వంద పడగలు ఇప్పించండి అన్నారట సవినయంగా.

ఓ జర్నలిస్టు శ్రీశ్రీపై రాసిన ఒక వ్యాసంలో శ్రీశ్రీని 'మహాకవిగా పదే పదే అభివర్ణించడాన్ని సహించలేని ఓ కవిగారు మహాకవి అనడం దేనికి కవి అంటే చాలదా? అదేం పెద్ద పొగడ్త అని వ్యాఖ్యానించారట. దానికి జర్నలిస్టు "అలా అయితే వీరేశలింగం గారిని 'మహాపురుషుడు' అనటం దేనికి? 'పురుషుడు' అంటే సరిపోతుంది కదా అని ఎదురుదెబ్బ తీసే సరికి ఆ కవిగారు మరి మాట్లాడలేదు. ఆ జర్నలిస్టు ఎవరో కాదు సుమండీ. నండూరి రామమోహనరావు గారు.

హాస్యజ్యోతి

రచన : శ్రీరమణ; వెల : రు.75/-; పబ్లిషర్స్ : నవోదయ పబ్లిషర్స్, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

ఇటువంటి హాస్యోక్తులు ఒకదానికి మించి ఒకటి సేకరించి పుస్తక రూపంలో అందించారు. ఇవేకాక పాత సామెతలకు కొత్త మెరుగులు దిద్ది కూడా అందించారు. ఉదాహరణకు అప్పు ఇచ్చిన వాడికి అడ్రస్ ఇచ్చినట్లు, అధిష్ఠానవర్గం అన్నందుకు కాదు - అపోజిషన్ వాళ్ళు విన్నందుకు. ఆడని సినిమాకి అన్నీ వంకలే. ఆకాశవాణిలో అభినయం చేసినట్టు. ఇలా ఎన్నో సామెతలు, చతురోక్తులతో చదువుతున్న కొద్దీ ఇంకాఇంకా చదవాలనిపిస్తూ ఎంతో సరదాగా సాగిపోతుంది.

రమణగారు ఈ పుస్తకం ద్వారా హాస్యానికి పెద్దపీట వేశారు.

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు అన్నట్లు జీవితవృక్షం కొసను పూచినపువ్వే నవ్వు. అది లేకపోతే ఈ బతుకు ఎంత బరువెక్కి పోయేదో. అయితే అది ఎంత ఇంపయిందో అంత ప్రమాదకరమైనది. లాఘవం లేని వాడు నవ్వించబోయి నవ్వులపాలు కావచ్చు.

- ఎస్.నాగ శిరీష

శ్రీకారం



అవిస్మరణీయుడు కామ్రేడ్ వి.కె.

సంపాదకుడు : పి.దస్తగిరి; వెల : రు.40/-; ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



సోషలిస్టు ఉద్యమం

రచన : సురమౌళి; వెల : రు.75/-; ప్రచురణ : సోషలిస్టు ఫ్రంట్, ఆంధ్రప్రదేశ్, ఎస్-5, జమునా సదన్, 295 మయూరి మార్గ్, బేగం పేట్, హైదరాబాద్

రెండక్షరాలు

రచన : జింబో; ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్, దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్; నవోదయ పబ్లిషింగ్ హౌస్, విజయవాడ

❋ రాకెట్ల వీరన్న

బలిష్ఠమైన రాతి కట్టడాలతో ఎన్నో వంపులతో, ఐదు మీటర్ల ఎత్తు, రెండు మీటర్ల వెడల్పుతో 25 హెక్టార్లలో నిర్మించిన ఆ కోటగోడ గ్రేట్‌వాల్ ఆఫ్ చైనాను తలపిస్తుంది. ఆంధ్రుల శౌర్యానికి, శిల్పుల నిర్మాణ, కళా నైపుణ్యానికి ఆ దుర్గం ఓమచ్చు తునక. అదే అనంతపురం జిల్లాలోని "గుత్తి దుర్గం"..


గుత్తి కోటలోని రంగస్థల మండపం

రతనాల సీమగా పిలువబడే రాయలసీమలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన గుత్తికోట పర్యాటకులకు కనువిందు చేస్తోంది. కర్నూలు, అనంతపురం జిల్లాల సరిహద్దులో ఏడవనెంబరు జాతీయ రహదారిలో ఈ దుర్గం ఉంది. గుత్తి పట్టణానికి సమీపంలో 300మీటర్ల ఎత్తున కొండలపై నిర్మించిన గుత్తికోట శతాబ్దాల చరిత్రకు నిదర్శనం. ఆంధ్రుల శౌర్యానికి, శిల్పుల నిర్మాణ కళా నైపుణ్యానికి ఈ కోట ఓ మచ్చుతునక. మూడు వైపులా కొండల మధ్యలో రాయల కాలం నాటి పురాతన నగరాన్ని కలుపుకొని నిర్మించిన ఈ కోట చరిత్ర విశేషాలను, ఆ కాలం నాటి వీరుల పరాక్రమ వైభవాలను గుర్తుకు తెస్తూ పర్యాటకులను ఆకర్షిస్తోంది. 25 హెక్టార్లలో నిర్మించిన ఈ సువిశాల మైన 'గుత్తి కోట' జాతీయ రహదారిలో వెళ్లే వారిని ఇట్టే ఆకర్షిస్తుంది. ఐదు మీటర్ల ఎత్తు, రెండు మీటర్ల వెడల్పుతో బలిష్ఠమైన కట్టడాలతో, ఎన్నో ఒంపులతో 25 హెక్టార్లలో నిర్మించిన ఆ కోటగోడ గ్రేట్‌వాల్ ఆఫ్ చైనాను తలపిస్తుంది. రాతికట్టడ ప్రాకారాలతో, వృత్తాకార బురుజులతో, రంగస్థల మండపాలతో, 101 తాగునీటి బావులతో ఉన్న ఈ దుర్గం అందచందాలను చూసి తీరాల్సిందే. కాని చెప్పనలవి కాదు. ప్రారంభంలో పెద్ద కందకంతో మొదలవుతుంది. దాన్ని దాటితే సింహద్వారం, నగరేశ్వర ఆలయం కనిపిస్తాయి. తర్వాత పురాతన నగరం గుండా కొద్ది దూరం వెళ్తే రెండో ద్వారం వస్తుంది. పైకి వెళ్లాలంటే 15 ద్వారాలు దాటాల్సి ఉంటుంది. పైదాకా విశాలమై న దారి కంకరతో ఏర్పాటు చేయబడింది. ఈ దారి గుండా అప్పట్లో పదాతి సైన్యం, అశ్వికసైన్యం, గజసైన్యం వెళ్లేది.

ఇలా రెండో ద్వారం దాటితే విశాలమైన మైదానం కనిపిస్తుంది. ఇక్కడ అప్పట్లో సైనికులు కవాతు చేసేవారు. అక్కడే అశ్వ, గజశాలలు కూడా ఉన్నాయి. వీటి కోసం పెద్ద బావికూడా ఉంది. మరికొంత దూరం వెళ్తే ఆస్థానంలో పని చేసే ఉద్యోగుల నివాసాలు కనిపిస్తాయి. ఇవి పూర్తిగా ధ్వంసమై వాటి ఆనవాళ్లు మాత్రమే ఉన్నాయి. తర్వాత కనువిందు చేసే రంగస్థల మంటపం


గుత్తి కోట

కనిపిస్తుంది. హిందువులకు నాట్యమండపంగానూ, ముస్లింలకు మసీదుగాను దీన్ని ఉపయోగించేవారు. దీన్ని బట్టి ఆకాలంలోనే హిందూ, ముస్లీముల ఐక్యతకు అలనాటి రాజులు కట్టుబడినట్లు తెలుస్తోంది. ఈ మండపాన్ని దాటగానే రాజమండపం వస్తుంది. దీన్ని "బేగం మహల్" అంటారు. దీనికి దగ్గరలో మురారిరావు గద్దె సభాభవనం కనిపిస్తుంది. దీన్ని దాటాక ఖిల్లా అనే శిఖరాగ్రభాగం ఉంది. ఇక్కడి నుండి చూస్తే చుట్టూ 50 కి.మీ దాకా కనిపిస్తుంది. ఇక్కడి నుండి పరిసరాలను పరిశీలించేటప్పుడు చూపరుల ఆనందానికి హద్దులుండవు. శత్రువులు కోటపై దండెత్తి వస్తే ఇక్కడి నుండి వాళ్లపై రాళ్లు దొర్లించేవారు. ఈ కోట నిర్మాణ శైలిని చూసి "విల్స్" అనే చరిత్రకారుడు క్షామం, మోసం తప్ప ఏవీ ఈ దుర్గాన్ని లొంగదీయలేవని కితాబిచ్చారు. క్రీ.పూ 2005 నుండి 900 వరకు ఇక్కడ నివాసాలు ఉన్నట్లు ఆధారాలున్నాయి. ఈ విషయాన్ని "బ్రిన్‌ఫూల్" అనే బ్రిటీష్ చరిత్రకారుడు ప్రకటించారు. కీ.పూ. 260 నుండి కోట విశేషాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రాంతాన్ని శాతవాహనులు, బాదామిచాళుక్యులు, రాష్ట్రకూటులు, పశ్చిమగంగరాజులు, పశ్చిమ చాళుక్యులు పాలించారు. కోటగోడను 11,12 శతాబ్దాలలో నిర్మించినట్లు తెలుస్తోంది. హరిహరబుక్కరాయలు గుత్తిని రాజధానిగా చేసుకుని పాలించినట్లు ఇక్కడున్న శ్లోకాల్ని బట్టి తెలుస్తోంది. విజయనగర రాజుల హయాంలో దుర్గం గొప్ప వెలుగును సంతరించుకుంది. విజయనగర రాజుల చిహ్నమైన గజలక్ష్మి అన్ని ద్వారాలపైనా కన్పిస్తోంది. విజయనగర సామ్రాజ్య పతనానంతరం బీజపూర్ నవాబులు దీన్ని పాలించారు. కీ.శ. 1650లో గోల్కొండ నవాబు కుతుబ్‌షాహిమీర్ జంబ్లా కోటను ముట్టడి చేసి కొన్ని నెలలు యుద్ధం చేసి స్వాధీనం చేసుకున్నారు. ఔరంగజేబు దాడుల్లో గుత్తి మొఘులుల చేతుల్లోకి పోయింది. కీ.శ. 1750లో మురారీరావు ఘోర్పడే గుత్తిని స్వాధీనం చేసుకున్నాడు. కీ.శ. 1762లో హైదర్‌ఆలీ దీనిపై దండెత్తి ఆరునెలలు యుద్ధం చేసినా గెలుపొందలేక వెనుదిరిగి పోయాడు.

అందమైన రంగస్థల మండపం, అశ్వ, గజశాలలు, 101 బావులతో, గ్రేట్‌వాల్‌ఆఫ్ చైనాను తలపించే కోటగోడతో ఉన్న ఈ గుత్తి దుర్గాన్ని ప్రతిపర్యాటకుడూ చూసి తరించాలి. ●

*ఆర్.రమేష్

ఇది బతుకుపాట...

"నాగావళి, వంశధార, చిత్రావతి లెన్నున్నా
ఉత్తరాంధ్ర రైతుకంట కన్నీరే కదరన్నా
గోదావరి, కృష్ణమ్మలు కడుపు చీల్చుకు పారినా
గొంతెండిన తెలంగాణ ఘోష ఎవడికి పట్టదన్న
తుంగభద్ర పెన్నాలు పెనవేసుకు సాగుతున్నా
రాయలసీమ ఎడారై ఎండుతుంది చూడన్నా"

అపారమైన జల వనరులున్నా ఉపయోగించుకోలేని మన ప్రభుత్వాల చేతకానితనాన్ని ప్రశ్నిస్తుందీపాట. సాగునీరు కరువై సేద్యం లేక పొలాలు బీళ్ళైనా ఊళ్ళన్నీ మద్యంతో కళకళలాడుతున్నాయి. మహిళల ఓట్లతో అధికారంలోకొచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం మద్యం వద్దన్న పాపానికి మహిళలని కూడా చూడకుండా రాక్షసంగా లాఠీలు విసురుతున్న సంఘటనలు రాష్ట్రంలో కోకొల్లలు. ఆ సంఘటనలకు స్పందనే ఈ పాట.

(గత వారం తరువాయి)

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మరో ప్రధాన సమస్య కరువు-సాగునీరు-తాగునీరు. కీలకమైన వ్యవసాయరంగం పట్ల, రైతాంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ కరువుకు కారణం. ఈ కరువు ప్రకృతి సృష్టించింది కాదు, పాలకుల సృష్టే అంటుంది తూములూరి వెంకటేశ్వరరావు గీతం.

"తాగునీటి కోసం - తన్నులాటలెన్నో
సాగునీటి కోసం - సమాచారాలు ఎన్నెన్నో
కరువు గాదు సుమ్మి - ఇది పాలకుల దొమ్మి"

చుట్టూ నదులున్నా చుక్క నీరుకు నోచుకోని రాష్ట్ర ప్రజల దుస్థితిని, ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వ అలసత్వాన్ని కళ్ళముందుంచుతోంది.

"మద్యం వద్దంటే లాఠి - తూటాలు జూపిస్తవా
మా సొమ్మేదోచి - తెగ నీతులు చెబుతున్నవా
ఆడోళ్ళతో పెట్టుకోకు చంద్రబాబు
అగమై పోతవురో హైటెక్కు బాబు"

కరువు రాగాలు

కరువు కన్నడ రాగం ఆలపించని స్థలం
నలువైపులా ఎటువెదికినా అదృశ్యం.
రేయనక, పగలనక, పురుగనక, పుట్టనక
ఆరుగాలం, ఆగకుండా, చెమటోడ్చిన
అన్నదాతకు వలస రాగం అనివార్యమైంది.
కోడికూతకు ముందే అప్పుల భూపాలం వినిపిస్తోంది.
తాకట్టులో ఉన్న తాళి తోడిరాగం తీస్తోంది.
ప్రజలకు పట్టెడన్నం అందించాల్సిన పల్లె
శహనాయిరాగం వాయిస్తోంది.
రైతు ఆర్థిక పరిస్థితి ఆరభి అయింది.
మిర్చికంట్లో కారం చల్లి, పత్తి తలగడ వత్తుకే మిగిలింది.
సహచర్యం చేసిన మూగజీవులు
గ్రాసం కరవై, కటి వానికి తోలేటప్పుడు
అనుబంధం వదల్లేక, అసావేరి ఆలపిస్తుంటే
హాలికులు ఆందోళనతో హిందోళంలో పడ్డారు.
సేద్యం అభేద్యమై, నిత్యావసర వస్తువుల ధర
తలపైకెక్కి తకధిమి, తకధిమి చేస్తోంది.
చెమటను నమ్ముకొన్న వాళ్ళకు
శ్రీరాగం సుడిలో వచ్చిన యంత్రాలు చేటయ్యాయి.
సగటు మనిషి ఆశలు ఆవిరైపోయాయి.



బరువు బతుకులు బీం పలాస్ బజాయిస్తుంటే
మధ్యలో మతకల్లోలాలు, స్వార్థ రాజకీయాలు
కరవుకు కేదారగౌళ జతపరచి
మధ్యమావతిగా వచ్చాయి.
కూటికరవు కరాళ నృత్యం చేస్తోంటే
ఆకలికి తాళలేక, ఆలపించే ఆఠాణరాగాలెన్నో!
అన్నపూర్ణగా పేరు బడ్డ దేశంలో
అన్నానికి కొరత తీరి, కల్యాణిరాగం మోగేదెన్నడో!!
ముసిరిన కరవు చీకట్లు తొలగి
మోహనరాగ వెలుతురులో పడేదెన్నడో!!!

- అచ్చుల

–దుర్గేష్ రచించిన ఈ గీతం రాష్ట్ర ప్రభుత్వం పట్ల, మద్యం పట్ల మహిళల్లో ఉన్న వ్యతిరేకతను, కసిని ప్రతిబింబిస్తే వేంపాటి బ్రహ్మయ్య గీతం కేంద్ర ప్రభుత్వ మతోన్మాద వైఖరిని, రాబోయే ప్రమాదాల్ని, వాటిని ఖండించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది.

"రానున్నది రానున్నది ఒక ప్రళయం
రాజకీయ రాబందుల రాక్షస సమరం
మతవాదులు సృష్టించే మారణహోమం
రగులనుంది రాజ్యమంత రావణకాష్టం"

అయోధ్య పరిసరాల్లో జరుగుతున్న సంఘటనలను, అధికారాన్ని నిలుపుకోవడానికి మరో గుజరాత్ ప్రయోగానికి జరుగుతున్న ప్రయత్నాలను తెలియజేయడంతో పాటు వాటిని లౌకికశక్తులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ఎదుర్కోవాల్సిన కర్తవ్యాన్ని ప్రబోధిస్తుంది.

"దేశభక్తి ముసుగులో దేశద్రోహులున్నారు
భరత జాతి భవితకు పెనుముప్పుగనున్నారు"

– ఆరిఫ్ సాధిక్ రచించిన ఈ గీతం ప్రభుత్వాధినేతలు దేశభక్తి ముసుగులో దేశద్రోహానికి పాల్పడుతున్న తీరును సవాలు చేస్తుంది.

"కార్గిల్ వీరుల శవపేటిక కొనుగోళ్ళు
రక్షణ సామాగ్రిలో అంతులేని కమీషన్లు
భూకబ్జా అక్రమాలే అధ్యక్షుల చరిత్రలు
తెహల్కా డాట్‌కామ్ తిరుగులేని సాక్ష్యాలు"

కార్గిల్ యుద్ధం మొదలుకొని నేటి స్టాంపుల కుంభకోణం వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి, ద్రోహపూరిత చర్యలను తూర్పారబడుతుంది. ఇక రాళ్ళబండి నర్సింహరాజు గీతం–

"కరువొచ్చిందే చెల్లీ – పల్లె గుండె చెరువయ్యిందే మళ్ళీ
తడి ఎరుగని వాకిళ్ళకు – కళ్ళ నీళ్ళే కళ్ళాపులాయె...
జలజగదపు జాడల తీరు – కల చెదిరిన వలసల జోరు
కోటి వరాల ఎండమావులు – ఊటలేని చేదబావులు

కరువుతో వట్టిపోయి, ప్రభుత మోసాలకు విసిగిపోయి, వలసలతో ఎలిసిపోయి కళ తప్పిన పల్లెను మన కళ్ళముందు ఆవిష్కరిస్తుంది. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా పాటలున్నాయి. ప్రపంచీకరణపై పి.ఎన్.మూర్తి, విద్య ప్రైవేటీకరణపై రవీంద్ర, తెలంగాణా అభివృద్ధిపై రాజేష్ ఖన్నా, వలసలపై రమణిచంద్ర, ప్రభుత్వ వధకాలపై ఎన్.వెంకటేష్, ఎ.వెంకటేష్, పెరుగుతున్న అప్పులభారాలపై జి.రాములు, సాగునీటిపై రమణ, ముఖ్యమంత్రి వాగ్దానాల వెనుక నిజాలను తెలుపుతూ కవి, రైతు సమస్యలపై మక్బూల్ షాషా, గోపాల్రావు, జన్మభూమి బండారం తెలుపుతూ ఎమ్.మల్లేశం, గిరిజన సమస్యలపై ధర్మానాయక్, ఇవే అంశాలపై ఉర్దూలో రహీంఖాన్ పాటలు రాశారు. దాదాపు 40కి పైగా పాటలు ఈ వర్క్‌షాపులో తయారయ్యాయి. ప్రతి పాటా దేనికదే వైవిధ్యభరితమైనది. వర్తమాన సమాజాన్ని ప్రతిబింబించేది. ఈ రచయితలందరూ నైపుణ్యం వున్న వారు కాదు. సాహిత్యాన్ని అవపోసన పట్టిన వారూ కాదు. ఇందులో చాలామందికి సాహిత్యం గురించి తెలియదు. కాని జీవితం గురించి తెలుసు. సమస్య పట్ల స్పందించడం తెలుసు. కనుకనే ప్రజలకోసం, ఉద్యమావసరాల కోసం అలవోకగా పాటలు అల్లుకుంటారు, పాడుకుంటారు. పాటకు పదును పెట్టి ప్రజలకు అందిస్తారు. అలా సృష్టించబడినవే ఈ పాటలు. ●

ఐదు నక్షత్రాల ఆసుపత్రి

చదువు సంతలో వస్తువయ్యాక విద్యవేలం పాట
వైద్యం ధనార్జనయ్యాక రోగం వ్యాపారమయం
కళ్ళుమిరుమిట్లు గొల్పే రమ్య హర్మ్యాలు
ఐదు నక్షత్రాల ఆసుపత్రులు
కార్డియాలజీ ర్యుమటాలజీ
యూరాలజీ నెఫ్రాలజీ
న్యూరాలజీ ఆప్తాల్‌మాలజీ
గ్యాస్ట్రో ఎంటిరాలజీ ఇంకా ఇంకా
శాఖలు ఉపశాఖల అనుబంధాలు
బారెడంత పదవులపైన
మూరెడంత డిగ్రీలలో నిల్చున్న డాక్టర్లు
ప్రపంచాన్ని చుట్టిన వాళ్ళు
ప్రపంచాన్ని చుట్టుతున్న వాళ్ళు!
పాలరంగు గోడలు పాలరాతి నేలలు
పాలవర్ణ దరహాసాలు
అరగంటలో ఆపరేషనుకు సిద్ధమై
అరలక్ష కట్టకపోతే
ఆశ వదులుకోమంటుంది ఆ మందహాసం
మాట మౌనమై బిల్లు మాట్లాడుతుంది
గుండె పగిలే నిశ్శబ్దం
గుండె పగులుతున్న శబ్దం!
ఇసిజి ఎకో ఆంజియోగ్రాములు
రక్తం మల మూత్ర పరీక్ష ఫీజులు
ఆకసాని కెగసి న్యూటన్‌ను ప్రశ్నిస్తాయి
ప్రాణం వస్తుంది పోతుంది
జీవించినా మరణించినా
బిల్లులు సమదృష్టితో చూస్తాయి
పేద ధనిక బేధం లేదు
అన్ని శరీరాలు ఒక్కటే!
ఏ డాక్టరు ఎందుకొచ్చినా
ఏ డాక్టరు ఏది రాసినా
వచ్చిన వాడు సవ్యసాచి
బిల్లు గాయం చెయ్యక మానదు!
అక్కడ డబ్బు స్వాగతిస్తుంది
డబ్బు పలకరిస్తుంది
డబ్బు మాట్లాడుతుంది
డబ్బు వీడ్కోలు చెపుతుంది!

- అడిగోపుల వెంకటరత్నమ్

ADVOCATE

న్యాయసలహాలు

అప్పిచ్చిన వ్యక్తి మోసం చేశాడు!

మాది ఏజన్సీ ఏరియా అయినందువల్ల మాకు రిజిస్ట్రేషన్ సౌకర్యం లేదు. మాభూమి, ఇల్లు, ఇండ్ల స్థలాలు అగ్రిమెంటుపైన మాత్రమే రాసుకుంటాము. విషయం ఏమనగా నేను 1996 సంవత్సరంలో ఒక వ్యక్తి (ఉద్యోగి) దగ్గిర నాకు సంబంధించిన అగ్రిమెంట్లు, హామీదారులతో పదివేల రూపాయలు అప్పుగా పుచ్చుకుని నేను సదరు వ్యక్తికి ప్రతినెలా వడ్డీ చెల్లిస్తూ వచ్చినాను. సదరు వ్యక్తినోటు టైం అయిపోతుందని నా పైన 2000 సంవత్సరంలో కోర్టులో దావా వేశాడు. అప్పటి నుంచి నా అగ్రిమెంట్లు అతని వద్దనే వున్నవి. కాని నేను పూర్తి పైకం చెల్లించాను. కేవలం 3 వేల వడ్డీ కోసం నాపై 20 వేలకు దావా వేసి నా అగ్రిమెంట్లు ఇవ్వక, కొందరికి నేను స్థలం కొన్నానని చెప్పినట్లు తెలిసింది. నా అవసరాన్ని ఆసరా చేసుకుని నా నుండి అగ్రిమెంట్లు అమ్మినట్లు రాయించుకున్నాడు. మా ఏరియాలో ఎవరైనా తాకట్టు పెట్టాలంటే అమ్మినట్లు రాయించుకోవటం, పదివేలు తీసుకున్నంత మాత్రాన అమ్మివేసినట్లు, అవుతుందా. నాకు అతను హామీగా వుంచినట్లు పత్రం కూడా రాయించి ఇచ్చినాడు. ఇంతకు ముందు నేను ఒక లాయరును సంప్రదించగా నా పేరున వున్నట్లు సెక్రటరీ నుంచి దాని నకళ్ళు తీసుకురమ్మని చెప్పినాడు. అలానే నకళ్ళను తెచ్చి ఇచ్చినాను. నేను నా భూమిని ఎలా స్వాధీనం చేసుకోవాలో తెలియచేయగలరు.

–శ్రీరాసం, ఖమ్మం జిల్లా

మీరు రాసిన ఉత్తరంలో కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వలేదు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక చట్టాలు, నిబంధనలు ఉన్నాయి. దాని ప్రకారం మీరు ఎవరికైతే అగ్రిమెంట్ చేశారో ఆయన గిరిజనుడా లేక గిరిజనేతరుడా అనే విషయం స్పష్టం చేయవలసిఉంది. అదేవిధంగా, మీ అవసరం కొద్దీ అప్పు తీసుకుని ధానికోసం మీ ఆస్తిని అమ్మినట్లుగా రాసివ్వడం సరైంది కాదు. చట్టం దృష్టిలో మీరు రాసిచ్చినది చెల్లుబాటు అవుతుంది. మీకు, మీరు రాసిచ్చినవారికి మధ్యన ఉన్న అంతర్గత నమ్మకానికి చట్టపరిధిలో విలువ లేదు. కాబట్టి ఇకపై ఈ రకమైన లావాదేవీలు, ఆస్తులు రాయించి ఇవ్వడాలు శ్రేయస్కరం కాదు.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :

న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ – 20

ఎక్కువ కట్టమనడం న్యాయమా?

నేను ఒక ప్రముఖ చిట్‌ఫండ్ కంపెనీలో **50** వేలు చీటి వేసి పాడాను. నేను కాక ఇంకో నలుగురు చేత ష్యూరిటీ సంతకాలు పెట్టించారు. నేను వాయిదాలు సరిగా కట్టలేకపోయాను. ఆఖరుకు **10** వేలు బాకీ పడ్డాను. కోర్టులో వేశారు. కోర్టులో **19** వేలకు డిక్రీ ఇచ్చారు. నవంబరు **13**వ తేదీ వాయిదా వున్నది. మొత్తం నాతో పాటు ఆ నలుగురికీ ఒక్కొక్కరికి **19** వేలు జీతంలో రికవరీ అని మా రైల్వే ఆఫీస్‌కు కోర్టు నుండి కాగితాలు వచ్చాయి. **19** వేలు మా అయిదుగురికి పంచకుండా ఒక్కొక్కరికి **19** వేలు అంటున్నారు. దయతో ఈ సమస్యకు పరిష్కారం తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

– సుబ్బారావు, సామర్లకోట

మీరు రాసిన ప్రకారం మీ నుండి, మీరు చూపిన ష్యూరిటీస్ నుండి డిక్రీ మొత్తాన్ని రికవరీ చేయడానికి చిట్‌ఫండ్ సంస్థ వారు ఎగ్జిక్యూషన్ ప్రొసీడింగ్స్ వేసి ఉంటారని అర్థమవుతోంది. అయితే 19 వేల రూపాయలకు డిక్రీ ఇచ్చిన పిమ్మట ఆ మేరకు మాత్రమే రికవరీ చేయవలసి ఉంటుంది. అది మీ నుండి రికవరీ చేయాలా లేదా ష్యూరిటీస్ నుండి రికవరీ చేయాలా అనే అంశం పూర్తిగా చిట్‌ఫండ్ కంపెనీ ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. అయితే అందరి నుండి రు. 19 వేల చొప్పున రికవరీ చేయాలని కోర్టు ఆదేశిస్తే వసూలు సొమ్ము ఎక్కువగా ఉంటుంది. కనుక మీరు, మీ ష్యూరిటీస్ ఏ కోర్టు నుండి అయితే రికవరీ ఆదేశాలు వచ్చాయో అదే కోర్టులో అభ్యంతరాలు తెలియచేస్తూ వెంటనే పిటిషన్ దాఖలు చేయండి. ఈ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకువెళ్ళి రికవరీ ఆపమని అడగండి. దీనిపై పూర్తిగా విచారణ జరిపిన తర్వాత కోర్టు వారు తగు ఆదేశాలివ్వగలరు. చిట్ పాడిన వ్యక్తిగా మొత్తం సొమ్ము మీరే చెల్లించడం సరైనది. అది ఐదుగురికి పంచాలనే అభిప్రాయం సరైంది కాదు.

ఎ. సత్యప్రసాద్,
హైకోర్టు న్యాయవాది

కావలసిన వస్తువులు:

క్యారెట్: 1 కి.గ్రా.

నిమ్మకాయలు: పదిహేను

నూనె: 100 గ్రా.

కారం: 100 గ్రా.

ఉప్పు: 100 గ్రా.

పసుపు: ఒక టేబుల్ స్పూన్

మెంతులు: రెండు టేబుల్ స్పూన్లు

ఆవాలు: రెండు టీ స్పూన్లు

వెల్లుల్లి: పెద్దది ఒకటి

చేసే విధానం: ముందుగా క్యారెట్లను శుభ్రంగా కడిగి పొడి గుడ్డతో తుడవాలి. నిమ్మకాయల రసం పిండుకోవాలి. క్యారెట్‌ను ఒక మాదిరి పొడవు ఉండేలా ముక్కలు కోసుకోవాలి. క్యారెట్ ముక్కలలో నిమ్మరసం, ఉప్పు, పసుపు కలిపి రెండు రోజులు ఉంచాలి. మెంతులు వేయించి వాటిని మెత్తగా నూరి అందులో వెల్లుల్లి వేసి దంచాలి. ఆవాలను కూడా పొడి చేయాలి. ఆవాలు, మెంతి పొడిని, కారాన్ని ముక్కల్లో కలుపుకోవాలి. ఇప్పుడు నూనెను వేడిచేసి కొంచె పచ్చి శనగపప్పు, మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర, ఇంగువ, కరివేపాకు వేసి తాలింపు పెట్టుకోవాలి.అందులో పచ్చడి వేసి కలపాలి. ఉప్పు ఎక్కువ తినేవారు మరో గుప్పెడు కలుపుకోవచ్చు. ఈ పచ్చడి ఓ నెల రోజుల వరకూ బాగుంటుంది.

ఎగ్ రైస్

ఎవరైనా బంధువులు వస్తారనిగానీ, మరే ఇతర కారణాల వల్ల కాని అన్నం ఎక్కువగా మిగిలిపోయినప్పుడు దానిని ఆ పళంగా తినాలంటే కష్టం. ఇలా మిగిలిన అన్నంతో ఎగ్ రైస్ తయారు చేసుకోవచ్చు. అన్నాన్ని పొడిపొడిగా చేయాలి. అన్నానికి తగినంత డాల్డాగాని, నూనెగాని వేసి అది కాగిన తరువాత కొన్ని లవంగాలు, చెక్క అనాస "పువ్వు, బిరియానీ ఆకు వేయాలి. అందులో ఒక స్పూన్ అల్లం వెల్లుల్లి ముద్ద వేసి. వేపాలి. తరువాత తగినన్ని పచ్చి మిరపకాయ ముక్కలు కూడా వేసి కొంచెం వేగనివ్వాలి. ఇప్పుడు సన్నగా, నిలువుగా తరిగి పెట్టుకున్న ఉల్లిపాయ ముక్కలను వేసి దోరగా ఉండేలా వేయించాలి. ఇప్పుడు ఉన్న అన్నాన్ని బట్టి రెండు లేదా మూడు కోడిగుడ్లను కొట్టి నూనెలో పోయాలి. అందులో తగినంత ఉప్పుకూడా వేసి గుడ్డు పొడిపొడిగా వచ్చే వరకూ వేపాలి. ఇప్పుడు అందులో అన్నం కలపాలి. దీనిని వేడివేడిగా పిల్లలకు వడ్డిస్తే ఇష్టంగా తింటారు. వెరైటీ కోసం వేడి అన్నంతో కూడా దీనిని తయారు చేసి పిల్లలకు పెట్టవచ్చు.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది